


దెబ్బతిన్న నాగార్జునసాగర్ డ్యాం స్పిల్ వే



తెనాలిలో పేదల ఇళ్లు ఉండాల్సిన కాలనీలో రెండంతస్తుల ఇల్లు

- జగనన్న కాలనీల్లో రియల్ దందా
- ప్లాట్ అమ్మబడును అంటూ బోర్డులు
- వైసీపీ అక్రమార్కుల చేతుల్లోకి ప్లాట్లు
- ప్రతి లేఅవుట్‌లోనూ 30 శాతం ఇళ్లు వారికే
- సొంతిళ్లు, కార్లు ఉన్న వారు లబ్ధిదారులట
- ఆ ఇళ్లలోనే పేకాట.. అసాంఘిక కార్యకలాపాలు

పేదల ఇళ్లు.. పెద్దలకు

ఇంటి ముందు కారు.. రెండంతస్తుల విలాసవంతమైన భవనం.. అందులో ఏసీ.. ఇతర ఆర్భాటపు హంగులు.. ఇదేదో ధనవంతులు ఉండే ప్రాంతం అనుకుంటే తప్పులో కాలేసినట్లే. పేదలు, నిరుపేదల కోసం అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో కనిపించే దృశ్యాలు. అదేంది.. పేదల కోసం ఏర్పాటు చేసిన కాలనీలు కదా.. అక్కడవారికి కార్లు, ఏసీలు, రెండంతస్తుల భవనాలు ఏమిటంటే. అదంతే.. వైసీపీ నేతల అక్రమాలకు కాలనీల్లోని ఈ దృశ్యాలు నిదర్శనంగా కనిపిస్తాయి. నిలువ నీడలేని నిరుపేదల కోసం జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో అత్యధికులు పేరుకే పేదలు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం అర్హత లేకున్నా వైసీపీ కార్యకర్తలు, వారి అనుచరులై ఉంటే చాలన్నట్లుగా జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జగనన్నకాలనీల్లో నిరుపేదలకివ్వాల్సిన స్థలాలు, ఇళ్లు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పక్కా భవనాన్ని ప్రభుత్వం కట్టిస్తుంటే దానిపై రెండు, మూడు అంతస్తులను పలువురు నిర్మించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోవడంతో ప్రస్తుతం జగనన్న కాలనీల్లో ఇళ్ల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన పొలాల్లో అక్రమాలు, నేతలు, ఎమ్మెల్యేలే కాంట్రాక్టర్ల అవతార మెత్తి చేసిన భారీ దోపిడీలు, నాసిరకం నిర్మాణాల వంటివే ఇప్పటి వరకు బయటకు రాగా.. నిబంధనలను తుంగలో తొక్కి మరీ వైసీపీ నాయకులు, వారు చెప్పిన వారికి ఇళ్లు కేటాయించడం మరో భారీ కుంభకోణమన్న ఆరోపణలున్నాయి.



తెనాలిలో పేదల ఇళ్ల కాలనీలో రెండంతస్తుల ఇల్లు

తెనాలి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేరుకే పేదలు... విలాసవంతమైన సొంతిల్లు, ఒకటి, రెండు కార్లు ఉన్నా వారు.. జగనన్న కాలనీల్లోని నిరుపేదలు. ఇళ్లు కొనబడును, అమ్మబడును అంటూ కాలనీల్లోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఇందుకు సంబంధించి బహిరంగంగానే బోర్డులు దర్శనం. ఇదంతా ఇటీవల తెనాలి నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ జగనన్న కాలనీల పర్యటనలో వెలుగుచూశాయి. ఒక్కో లేఅవుట్‌లో 10 నుంచి 30 శాతం పైగా ఇళ్లు వైసీపీ నేతలు, వారి అనుచరులకు దక్కినట్లు సమాచారం. తెనాలి మండల పరిధిలోని జగనన్న కాలనీల్లో కొన్ని ఇళ్లు రెండు, మూడంతస్తులు ఉండటం, కార్లు, ఖరీదైన గృహోపకరణ, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండటం మంత్రి మనోహర్ చూసి విస్తుపోయారు. దీనికి తోడు కొన్ని ఇళ్లముందు ఇల్లు అమ్మబడును అని బోర్డులు కనిపించటం, మరికొన్ని ఇళ్లముందు రియలెస్టేట్ బోర్డులు కనిపించడంతో ముందు లబ్ధిదారుల జాబితాను పరిశీలించాలని, అనర్హులు ఉంటే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వీటిపై దృష్టిపెడితే, కొందరికి సొంతిళ్లు పట్టణంలో ఉండటం, మరికొందరికి విద్యుత్తు మీటర్లు రెండు, మూడు ఉండటం, కార్లు, ఖరీదైన గృహోపకరణాలున్నట్లు ఆధారాలు లభించడంతో వాటిని తొలగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెనాలి పరిధిలోని పెదరావూరు లేఅవుట్‌లో 1841 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా వారిలో 200 మంది అనర్హులుగా తేలారు. మిగిలిన లేఅవుట్లలో కూడా భారీగానే అనర్హుల జాబితా బయటపడుతోందని అధికారులు చెబుతున్నారు. ఇదే తీరులో గుంటూరు జిల్లా మొత్తంలో చూస్తే కనీసం 13 వేల నుంచి 18వేల వరకు అక్రమార్కుల చేతుల్లోకి పేదల స్థలాలు వెళ్లి ఉంటాయనేది అంచనా. గుంటూరు, నల్లపాడు, పొన్నూరు, మంగళగిరి వంటి పట్టణాల్లో ఈ తరహా అనర్హుల జాబితా భారీగానే ఉందనేది అధికారుల మాట.

వైసీపీ కాంట్రాక్టర్‌లపై కేసులు


జగనన్న కాలనీ పేరుతో వైసీపీ సర్కారు ఇల్లు లేని పేదలకోసం ఇళ్ల స్థలాలిచ్చి, వాటిలో ఇల్లు కట్టించే పని చేపట్టింది. అయితే నిర్మాణ పనుల్లో, నిధులు గోల్‌మాల్, అడ్వాన్స్‌లు తీసుకుని పనులు చేయకపోవడం, నాసిరకం నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్ ముసుగులోని వైసీపీ నాయకులపై క్రిమినల్ కేసులకు వెనకాడటంలేదు. జనం సొమ్ము దోచేసి, వారి ఇళ్లు నిర్మించకుండా వారిపైనే దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనలు గతంలో ఉండటంతో కాంట్రాక్టర్లపై కేసులు పెట్టడంపై లబ్ధిదారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తెనాలిలో ఐదుగురు కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. మిగిలిన కాంట్రాక్టర్లు తాము తీసుకున్న అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించేందుకు ముందుకు రావడంతో వారికి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. ఆరుగురు కాంట్రాక్టర్‌లపై కేసులు పెట్టేందుకు గృహనిర్మాణ శాఖ ముందుకు వస్తే, వారిలో ఓ వ్యక్తి ఎన్నికలకు ముందు కూటమి పార్టీలో చేరాడు. దీంతో అతను చెల్లించాలిన సొమ్ము భారీ మొత్తమే అయినా, కేసు నమోదు చేయకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

లబ్ధిదారుల పేరుతో నొక్కేసిన కాంట్రాక్టర్లు

కాలనీల్లో ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షలు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా ఇవ్వకపోగా, లబ్ధిదారులకు డ్వాక్రా రుణాల కింద రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు అప్పు మంజూరు చేయించి, వాటినికూడా కాంట్రాక్టర్ల అవతారమెత్తిన వైసీపీ నేతలే నొక్కేశారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడి కాంట్రాక్ట్ సంస్థ రాక్రీట్ భాగోతం బయటపడిన సంగతి తెలిసిందే. చాలాదగ్గర్ల స్థానిక నేతలు కూడా ఇళ్ల కాంట్రాక్టర్ అవతారమెత్తి మేసేశారు. వారికి ఏ అర్హతా లేకున్నా నిర్మాణ పనులు కట్టబెట్టారు. అయితే ఇప్పటి వరకు మొదలుపెట్టని ప్లాట్లలో ఏ పనులు చేయకూడదని, పనులు మొదలుపెట్టి వివిధ దశల్లో ఉన్న ఇళ్లను మాత్రం పూర్తిచెయ్యాలనేది ప్రభుత్వ షరతు. వీరి స్థానంలో కొత్తవారిని తీసుకొచ్చినా మెటీరియల్ లెక్కతేలక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. దీంతో వారితోనే పనులు పూర్తిచేయించి, మిగిలినవాటిని మాత్రం లబ్ధిదారుల ఇష్టానుసారం నిర్మించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

కట్టడి చేయండి..

జగనన్న కాలనీల్లో ఏంచేసినా గత ప్రభుత్వ కాలంలో పోలీసులు అడుగుపెట్టే పరిస్థితి లేదు. దీంతో నిర్మాణం పూర్తయిన, మధ్యలో ఆగిపోయిన ఇళ్లలో జూదం విచ్చలవిడిగా సాగిపోతోంది. కొన్ని కాలనీల్లో పోలీసులు నిఘా వేస్తే, కొన్ని ముఠాలు పట్టుబడినా, ఇంకా అసాంఘిక కార్యకలాపాలు సాగిపోతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగకుండా పేకాటతోపాటు వ్యభిచారం వంటివి జరుగుతున్నాయని వాటిని కట్టడి చేయాలని లబ్ధిదారుల కోరుతున్నారు.



తెనాలిలో పేదల ఇళ్ల కాలనీలో రెండంతస్తుల ఇల్లు

స్పిల్ వేకు.. కోత


- రూ.20 కోట్లతో గతేడాదే మరమ్మతులు
- పనుల్లో నాణ్యతా లోపాలతో మళ్లీ గండ్లు
- సాగర్ ప్రాజెక్టు నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆందోళన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

22.35 లక్షల ఎకరాలకు సాగునీరు.. లక్షల జనాభాకు తాగునీరు.. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి.. కృష్ణానదిపై మానవనిర్మితమైన అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు.. దేశంలోనే రెండో స్థానంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రధాన ప్రాజెక్టుగా ఉన్న సాగర్ ప్రాజెక్టు నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంది. ప్రాజెక్టులో కీలకమైన స్పిల్ వే నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. ఇటీవల వరద పోటెత్తడంతో సాగర్ క్రస్ట్ గేట్లన్నీ ఎత్తి దాదాపు 5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో వరద తాకిడికి స్పిల్ వే కోతకు గురైంది. ఇటీవల గేట్లన్నీ మూసేసి నీటి విడుదలను అధికారులు ఆపేశారు. దీంతో స్పిల్‌వేకు పడిన గండ్లు వెలుగుచూశాయి. డ్యాంలో అత్యంత కీలకమైన స్పేల్‌వే కోతకు గురవడం ఆందోళనకరంగా మారింది. వచ్చే వేసవిలో స్పిల్‌వేకు మరమ్మతు చేపడతామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణపై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదకర పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పనులపై అనుమానాలు..

డ్యాం నుంచి నీరు కిందకు ప్రవహించే ప్రాంతాన్ని స్పిల్ వే అంటారు. వరద నీరు విడుదల చేసిన సందర్భంలో స్పిల్ వే కోతకు గురవుతుంది. డ్యాం భద్రత స్పిల్ వేతో ముడిపడి ఉండటంతో గత ఏడాది సుమారు రూ.20 కోట్లతో మరమ్మతులు చేశారు. వరద ఉధృతితో పడిన గండ్లను పూడ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి మరమ్మతులు చేపట్టామని అప్పట్లో అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో వరద ఉధృతికి స్పిల్ వే కోతకు గురికాకుండా ఉండేలా విదేశాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఎం 60 గ్రేడ్ సిలికాన్ ఫైబరీ రీ ఇన్ఫోర్స్‌డ్ కాంక్రీట్‌ను వినియోగించామని నాడు అధికారులు ప్రకటించారు. అయితే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే మళ్లీ కోతకు గురవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతా పరీక్షల్లో కూడా పనులు పటిష్ఠంగా జరగలేదని తేలినట్లు సమాచారం. ఈ కారణంగానే మరో సారి వరద ఉధృతికి స్పిల్ వే దెబ్బతిన్నదన్న విమర్శలున్నాయి. పనుల్లో నాణ్యత డొల్లతనం మరోసారి బయటపడటం గమనార్హం. పూర్తిస్థాయిలో నాణ్యత లోపించడం వల్లే స్పిల్ వే దెబ్బతిన్నదన్న వాదన వినిపిస్తోంది. సాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పనుల సందర్భంగా కూడా రూ.60 కోట్లతో స్పిల్ వేను అభివృద్ధి చేశారు. అయినా స్పిల్‌వే కోతకు గురికావడం పరిపాటిగా మారింది. స్పిల్ వే నిర్మాణంలో లోపాలు ఉండటంతో మరమ్మతులు చేసినా దెబ్బతింటున్నట్లు జలవనరులు శాఖ ఇంజనీర్లు చెబుతున్నారు. జలాశయంలో కీలక భాగమైన స్పిల్ వే నిర్వహణలో అలసత్వాన్ని విడనాడాలని నిపుణులు సూచిస్తున్నారు. వరద ఉధృతికి కోతకు గురికాకుండా స్పిల్‌వేకు మరమ్మతులు చేపట్టాలన్న వాదన వినిపిస్తోంది.



దెబ్బతిన్న నాగార్జునసాగర్ డ్యాం స్పిల్ వే

6లో..

మండలికి ఆలపాటి



- పోటీకి టీడీపీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం
- రాజా అభిమానుల్లో వెల్లివిరిసిన ఆనందం

ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆలపాటి

పట్టభద్రుల ఓటుకు.. నేడు నోటిఫికేషన్

- నవంబరు 6 వరకు ఫారం-18ల స్వీకారం
- అదే నెలలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం
- డిసెంబరు 30న తుది ఓటరు జాబితాల ప్రచురణ

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సన్నాహక ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఓటర్ల నమోదు నిబంధనలు 1960 ప్రకారం రూల్ 31(3) కింద ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ని జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నాగలక్ష్మి విడుదల చేస్తారు. ఆ మరుక్షణం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకారం మొదలౌతుంది. 2016లో ఎన్నికల సంఘం జారీ చేసిన సవరణ ఆదేశాల మేరకు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కొత్తగా ఓటుహక్కు కోసం నమోదు చేసుకుని ఓటరుగా నమోదు కావాల్సిందే. ఆ ప్రకారం ఎవరైతే 2024 నవంబరు 1కి పట్టభద్రులు అవుతారో వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుండగా అక్టోబరు 15, 25 తేదీల్లో రీ-పబ్లికేషన్‌ని ప్రచురిస్తారు. నవంబరు 6 వరకు ఫారం-18లో ఓటరు దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అదే రోజు నుంచి డిసెంబరు 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 25 లోపు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు. ప్రస్తుత ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవీకాలం 2025 మార్చి 29తో ముగుస్తుంది. ఈ దృష్ట్యా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్‌ని ఎన్నికల సంఘం జారీ చేసే అవకాశం ఉంది.



2,48,799 మంది ఓటర్లుగా 2019లో నమోదు

కృష్ణ - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 2019లో ఎన్నిక జరిగింది. అప్పట్లో కృష్ణా జిల్లాలో 1,06,829, గుంటూరు జిల్లాలో 1,41,970 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. మొత్తంగా 2,48,799 మంది ఓటర్లుగా నమోదు కాగా పోలింగ్‌కు వచ్చేసరికి దాదాపుగా లక్ష మంది దూరంగా ఉన్నారు. 1,49,319 మంది పట్టభద్రులు ఆ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారి కోసం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 153, ఉమ్మడి గుంటూరులో 209 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా వెయ్యి మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు జిల్లాల సంఖ్య పెరిగింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, కృష్ణ జిల్లాలున్నాయి. అయితే వీటికి రాష్ట్రపతి నుంచి గజిట్ నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఈ కారణంగా కృష్ణ - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా పరిగణిస్తారు. ఐదున్నరేళ్లలో గ్రాడ్యుయేట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ఈ దఫా ఓటర్ల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఎక్సైజ్‌లో.. బదిలీలు

- సీఐల పోస్టింగ్‌ల్లో మార్గదర్శకాలకు పాతర
- నిబద్ధత, అంకితభావం కలిగిన వారికి అన్యాయం
- ఏసీబీ కేసులు, వైసీపీ నేతలతో అంటకాగిన వారికి గుంటూరులో పోస్టింగ్

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో జరిగిన సీఐ బదిలీలపై ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనితీరులో అంకితభావం.. కేసులను పరిష్కరించి ఉన్నతాధికారుల ప్రశంసలను పట్టించుకోలేదు. నిబద్ధత.. అంకితభావం అవసరం లేదని నిరూపించారు. ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సులు బుట్టదాఖలయ్యాయి. ఏసీబీ కేసులు ఉన్నా.. వైసీపీ ప్రభుత్వంలో ఆ నేతలతో అంటకాగిన వారికి గుంటూరులో పోస్టింగులు దక్కాయి. మొత్తంమీద అడ్డగోలుగా.. ఇష్టారాజ్యంగా ఎక్సైజ్ సీఐల బదిలీలు జరిగాయని శాఖలోని అధికారుల నుంచే ఆరోపణలు వస్తున్నాయి. ఎక్సైజ్ సీఐల పోస్టింగుల వ్యవహారంలో జరిగిన అక్రమాలు అంతాఇంతా కాకుండా ఉన్నాయి. బదిలీలకు సంబంధించి జీవో 75లో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఏసీబీ కేసులు ఉన్నవారికి అప్రాధాన్య పోస్టులు, పనితీరు ఆధారంగా ప్రాధాన్య పోస్టులు కేటాయించాలని, ఒక్కో అధికారికి ఐదు ఆప్షన్లు అడిగారు. అయితే బదిలీల్లో ఈ మార్గదర్శకాలు, నిబంధనలను పట్టించుకోలేదు. రాష్ట్రంలో నాలుగు జోన్లు ఉండగా 3 జోన్లలో సీఐల బదిలీలు జరిగాయి. సర్వీసులో రిమార్క్ లేని వారికి అప్రాధాన్య పోస్టులు దక్కాయి. పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ అధికారికి గుంటూరులో తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన ఓ అధికారి ఎన్నికల ముందు కోరుకున్నచోట ఉద్యోగం చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత ఆ అధికారిని వైసీపీ ఎంపీ తన ఇలాఖాలో పోస్టింగ్ వేయించుకున్నారు. తాజా బదిలీల్లో ఆ అధికారి గుంటూరులో పోస్టింగ్ వేయించుకున్నారు. గత ప్రభుత్వంలో, ఇప్పుడు ఆ అధికారికి కోరిన చోట పోస్టింగు రావడంపై ఆ శాఖ అధికారులే విస్తుపోతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు అసహనం

అడ్డగోలు బదిలీలపై ఎంపీ, ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమర్థతకు పట్టం కడుతూ కొందరిని తాము సిఫార్సు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైరవీలు చేసుకున్న వారికి ప్రాధాన్య పోస్టింగ్‌లు దక్కడంతో అసలు ఎక్సైజ్ శాఖలో ఏం జరుగుతుందని ఆరా తీస్తున్నారు. ఈ బదిలీల వ్యవహారంపై అమీతుమీ తేల్చుకునేందుకు నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బదిలీలు.. బేరాలు

- పంచాయతీ ఆదాయాన్ని బట్టి రేటు
- కార్యదర్శుల నుంచి భారీగా ముడుపులు
- డీపీవోలో చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 29: పంచాయతీ ఆదాయాన్ని బట్టి రేటు.. ఆ మొత్తం చెల్లించిన వారికే పోస్టింగ్.. ఇదీ పంచాయతీరాజ్‌లో కార్యదర్శుల బదిలీ తీరు. ఆదాయాన్ని బట్టి పంచాయతీలకు గ్రేడ్లు ఉంటాయి.. కానీ జిల్లాలో బదిలీలకు జరిగిన బేరాన్ని బట్టి గ్రేడ్లు మార్చి ఆ ప్రకారం బదిలీలు చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు మధ్య వర్తులుగా ఉండి ఈ అశాస్త్రీయ తతంగాన్ని నడిపించారు. వారితో మాట్లాడి రేటు కుదుర్చుకున్న వారికి మేజర్ పంచాయతీలను మైనర్ పంచాయతీ కంటే తక్కువ ఆదాయాన్ని చూపించి కార్యదర్శులను బదిలీలు చేశారు. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం పంచాయతీ ఇంటి పన్నుల ఆదాయమే రూ.60 లక్షలు. అక్కడకి బదిలీ కావాలంటే రూ.2 లక్షలు. రూ.లక్షల్లో ఆదాయం వచ్చే తాడికొండ మండలం లాం పంచాయతీకి బదిలీ కావాలంటే రూ.లక్ష. ఇలా పంచాయతీ ఆదాయాన్ని బట్టి బదిలీలకు రేటు నిర్ణయించారు. బేరం కుదిరిన తర్వాత మేజర్ పంచాయతీలను గ్రేడ్-5 జాబితాలోకి నెట్టేశారు. నిషేధం అమల్లోకి వచ్చిన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై అధికారులు హడావుడి చేశారు. పాత జీవోను, గెజిట్‌ను పూర్తిగా పక్కన పెట్టేశారు. గ్రేడ్- 5లో ఉన్న గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు మేలు చేసేలా ఇష్టానుసారంగా గ్రేడ్లు మార్చేసి పంచాయతీలను విడగొట్టారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత కొందరిని పిలిపించుకుని వారికి రహస్యంగా ఉత్తర్వులు అందజేశారని సమాచారం. బదిలీలపై డీపీవో కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు కలెక్టరేట్ అధికారులను ఉద్దేశ పూర్వకంగా తప్పుదారి పట్టించినట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు చెప్పినా వినాల్సిన పనిలేదన్న ధోరణిలో ఓ ఉద్యోగి జాబితా తయారు చేసినట్లు తెలుస్తోంది. వారిని కలవనిదే కోరుకున్న చోటకి బదిలీ జరిగే అవకాశం లేదని పలువురు చెబుతున్నారు.



లాం ఇస్తామని...

ఓ పంచాయతీ కార్యదర్శికి తాడికొండ మండలంలోని లాంకు బదిలీ చేస్తామని రూ.లక్ష తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఏమి జరిగిందో కానీ అతడ్ని అక్కడికి మార్చలేదు. అమరావతి మండలం ధరణికోటలో జరిగిన బదిలీ కూడా ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు కొందరు బదిలీ స్థానాన్ని మార్పించుకునేందుకు జిల్లా అధికారి కార్యాలయంలో పావులు కదుపుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై కొందరు కోర్టుకి వెళ్లారు. గ్రేడ్-5 పేరుతో పంచాయతీ లను విడగొట్టి బదిలీలు చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సమాచారమే ఇంధనం. అన్ని రంగాల్లో తారతమ్యాలు ఉన్నట్లే, సమాచార ప్రసారంలో కూడా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్నంత సమాచార వ్యాప్తి మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం లేదు. కారణంగా సమాచార సమ్మిళితత్వం కొరవడి విద్య, ఆర్థిక, సాంకేతికపరమైన అంతరాలు ఇంకా విస్తరిస్తున్నాయి. 'వన్ నేషన్ - వన్ మార్కెట్', 'ఈ-నామ్' వంటి ప్రభుత్వ సమ్మిళితాభివృద్ధి చర్యలు మారుమూల ప్రాంత రైతులు, చేతివృత్తుల వారు, వ్యాపారుల వరకూ చేరలేకపోతున్నాయి.

దీనికి కారణం ప్రైవేటు టెలికం ఆపరేటర్లకు పట్టణాల్లో ఉత్పన్నమయ్యే ఆదాయం గ్రామీణ ప్రాంతాల నుంచి లభించకపోవడం. జనసాంద్రత తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలతో పోలిస్తే నిర్వహణ వ్యయాలు అధికంగా ఉండటం. అయితే, ప్రైవేటురంగం వెనకడుగు వేసిన సమయాల్లో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంటుంది. ఈ నిమిత్తం బీఎస్ఎన్ఎల్ ఒక ప్రత్యామ్నాయంగా కొనసాగినప్పటికీ నిధులు, నిర్వహణాపరమైన సమస్యలతో కూనరిల్లుతోంది. ఈ నేపథ్యంలో సంస్థాగత మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' ప్రణాళికలో భాగంగా 1885 నాటి 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని' రద్దుచేసి, 2023లో 'టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్'ను తీసుకువచ్చింది. టెలికాం రంగంలో పెట్టుబడులను విస్తరించడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా టెలికం సేవలు విస్తరించి సమ్మిళిత సమాచార వ్యవస్థను రూపొందించడానికి టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్-2023లో 'డిజిటల్ భారత్ నిధి' ఏర్పాటును అంతర్భాగం చేశారు.

అయితే టెలికం రంగంలో ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు సేవలను విస్తరించేందుకు నిధుల సమీకరణ నిమిత్తం 2003లో ఏర్పాటు చేసిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్(యూఎస్ఓఎఫ్)' స్థానంలో ఈ డిజిటల్ భారత్ నిధిని తీసుకువచ్చారు.

డిజిటల్ భారత్ నిధి



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

యూఎస్ఓఎఫ్ రద్దుకు కారణాలు

ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌కు సవరణలు చేసి 2003లో ఈ 'యూఎస్ఓఎఫ్' నిధిని మారుమూల ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించేందుకు పెట్టుబడులు జమ చేసే ప్రత్యేక నిధిగా రూపొందించారు.

టెలికాం ఆపరేటర్ల అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ(ఏజీఆర్-సవరించిన స్థూల ఆదాయం)పై 5 శాతం లెవీ విధించడం ద్వారా ఈ నిధికి వనరులు సమకూరేవి. అయితే ఈ నిధిని స్థాపించిన నాటినుంచి వనరుల అసమర్థ వినియోగం గురించిన విమర్శలను ఎదుర్కొంటూనే ఉంది.

2017-22 మధ్యకాలం చూసుకుంటే ఈ నిధికి రూ.41,740 కోట్లు జమ అవగా, ఖర్చు చేసిన మొత్తం మాత్రం రూ. 30,213 కోట్లు (72 శాతం)గా ఉంది. ఈ నిధుల్లో అత్యధిక భాగం గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికాం అనుసంధానత విస్తరించడానికి 'భారత్ నెట్ ప్రాజెక్టు' ద్వారా వినిమయం చేయడానికి కేటాయించినా అవి పూర్తిస్థాయిలో వ్యయం చేయలేదు.

ఈ లోపాలను అధిగమించి, టెలికాం రంగంలో మరింత విస్తారమైన సేవలు, వినూత్న కార్యాచరణలు ప్రతిపాదిస్తూ 'డిజిటల్ భారత్ నిధి'కి రూపకల్పన చేశారు. ఈ నిధిని టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్ 2023, సెక్షన్ 24(1) ప్రకారం ఏర్పాటు చేశారు.

దిక్సూచి DIKSUCHI

డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్)

యూఎస్ఓఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ డిజిటల్ భారత్ నిధి కార్యాచరణ పరిధిని మరింత విస్తరించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్స్ సేవలు విస్తరించడంతోపాటు, టెలీ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సాంకేతికతలు, ఉత్పత్తుల అభివృద్ధికి, వివిధ రంగాల్లో పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), పైలెట్ ప్రాజెక్టులకు, బలహీన వర్గాలు, వికలాంగులు, స్త్రీలు, స్వయం సహాయక సంఘాలు వంటి వారికి సహాయం చేసే పథకాలు/ప్రాజెక్టులకు ఈ నిధి నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. అదేవిధంగా టెలికాం ఆపరేటర్ల నుంచి వసూలు చేసిన నిధులు(డీబీఎన్ నిధులు) టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్(2023) సెక్షన్ 25 ప్రకారం తొలుత సంఘటిత నిధికి జమ అవుతాయి. తదుపరి కేంద్రప్రభుత్వం ఆ నిధులను పార్లమెంటు ఆమోదంతో డీబీఎన్‌కి బదలాయిస్తుంది.

ఈ నిధికి సంబంధించి ప్రాధికార సంస్థ అయిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్' ఇటీవల డిజిటల్ భారత్ నిధి నిర్వహణ నియమావళిని విడుదల చేసింది. ఈ నిధిని నిర్వహించే అడ్మినిస్ట్రేటర్ నియామకం, విధులు, నిధి లక్ష్యాలను అమలుచేసే ఇంప్లిమెంటర్(అమలుదారు) ఎంపిక వంటి అంశాల గురించి విశదీకరించడం జరిగింది. ఈ నియమావళి ప్రకారం, కేంద్రప్రభుత్వం డిజిటల్ భారత్ నిధికి ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. బిడ్డింగ్ లేదా నామినేషన్ ద్వారా అమలుదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం, వారిని సమయానుసారం పర్యవేక్షించడం, వివాదాల పరిష్కారం, నిధుల పంపిణీ, నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం, మూల్యాంకనం తదితర విధులను అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటాడు.

అమలుదారుల ఎంపిక ప్రాథమికంగా రెండు విధాలుగా ఉంటుందని నియమావళి సూచిస్తోంది. టెలీ కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రమోషన్ కోసం అమలుదారులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. అదే పరిశోధన, అభివృద్ధి కోసం అయితే అప్లికేషన్ ఆధారిత ఎంపిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఆపరేటర్స్‌ను నామినేట్ చేసే విచక్షణాధికారాన్ని అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటారు. టెలీ కమ్యూనికేషన్స్ సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చడం, నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్ రంగంలో నవకల్పనలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు మద్దతు ఇవ్వడం వంటి కార్యక్రమాలకు గాను అమలుదారుకు నిధులను కేటాయిస్తారు.

ఈ నిధులను అందరికీ ఒకే తరహాలో కాక, అమలుదారుల కార్యకలాపాలను ఆధారం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ వారికి పూర్తిగా లేదా పాక్షికంగా కానీ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, కో ఫండింగ్ తరహాలో నష్టభయాలను తగ్గించుకునేవిధంగా నిధుల కేటాయింపును నిర్ణయిస్తాడు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

డీబీఎన్ ద్వారా ఆశిస్తున్న ప్రయోజనాలు

1. సమాచార యుగం లో డిజిటల్ అంతరాలను రూపుమాపి, ప్రతీ ఒక్కరికీ సమాచార విప్లవ ఫలితాలు అందేలా డిజిటల్ సమ్మిళితత్వాన్ని తీసుకురావడం. తద్వారా ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించడం.
2. టెలికాం రంగంలో రాబోయే సరికొత్త తరం టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి వ్యవస్థాగత సంసిద్ధత, అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి. ఉదాహరణకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో 5జీ టెక్నాలజీని అందిపుచ్చుకునే సంసిద్ధత సాధించే లోపే 6జీ ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. 5జీ కన్నా వెయ్యిరెట్లు వేగవంతమైన 6జీని భారత్‌లో ప్రవేశపెట్టాలంటే మరింత మెరుగైన ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థ, అనుసంధానతలపరమైన నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతలను అభివృద్ధి పర్చుకోవాల్సి ఉంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి డీబీఎన్ నిధి సహకరిస్తుంది.
3. ప్రపంచస్థాయి ప్రమాణాల సాధన ద్వారా భారత టెలికాం రంగాన్ని అభివృద్ధి చేయడం, తద్వారా డిజిటల్ మార్కెట్‌ల విస్తృతి మరింత పెంచి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం. వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నేడు ఆటోమేటిక్ రూట్ ద్వారా అవకాశం ఉన్న సందర్భంలో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.
4. టెలికాం రంగ అభివృద్ధి ద్వారా ఈ-గవర్నెన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ వంటి పారదర్శక విధానాలను ప్రభుత్వ పాలనలో తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడం.
5. టెలికాం రంగంలో నవకల్పనలను, స్టార్టప్‌లను, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని టెలికాం రంగ హబ్‌గా మార్చడం. రాబోయే కాలంలో మెటావర్స్, డ్రైవర్‌లెస్ కార్ల వంటి టెలికాం రంగ అనుసంధానత గల విప్లవాత్మక రంగాల్లో ఎర్లీ బర్డ్ అడ్వాంటేజ్‌ను సొంతం చేసుకోవడం.

అయితే ఇలాంటి ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలను, సైబర్ సెక్యూరిటీ సమస్యలను, ఈ-వేస్ట్ నిర్వహణ లోపాలను అధిగమించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా టెలీడెన్సిటీ పరంగా 133.76%గా ఉన్న పట్టణస్థాయికి 58.56%గా ఉన్న గ్రామీణ స్థాయికి మధ్య ఉన్న భారీ అంతరాన్ని తగ్గించడానికి డీబీఎన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాల్సి ఉంది. అప్పుడే భారత్ డిజిటల్ ఇండియా కల సంపూర్ణంగా సాకారమవుతుంది.

నంబర్ రిపీట్ టెస్ట్

పార్ట్-1

రీజనింగ్

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో అనేక సంఖ్యల క్రమం(లాంగ్ నంబర్ సిరీస్) లేదా వర్ణమాల అక్షరాల క్రమం (ఆల్ఫాబెటికల్ లెటర్ సిరీస్) ఇస్తారు. ఈ రకమైన ప్రశ్నలకు అభ్యర్థి ముందుగా ప్రశ్నలో ఇచ్చిన నియమాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకొని కచ్చితంగా అదే నియమాన్ని అనుసరిస్తున్న సంఖ్యల సమూహాలు లేదా వర్ణమాల అక్షరాల సమూహాలు ఇచ్చిన సిరీస్‌లో ఎన్నిసార్లు వచ్చిందో సరిచూసుకొని నాలుగు ఆల్టర్నేటివ్ చాయిస్‌ల నుంచి సమాధానాన్ని గుర్తించాలి.

గమనిక: ఈ టెస్ట్‌కి సంబంధించిన ప్రశ్నలలో సాధారణంగా మూడు సంఖ్యలు లేదా మూడు వర్ణమాల అక్షరాలను ఒక సమూహంగా భావించాలి. (ముందు అనగా ఎడమవైపు, తరవాత అనగా కుడివైపు అని అర్థం)

1. కింది సంఖ్యాక్రమంలో ముందు 2 ఉండి, తరవాత 4 గల 3లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

ఎ) మూడు బి) నాలుగు సి) రెండు డి) ఏమీలేవు

సమాధానం: (ఎ)

వివరణ: 6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

పై ప్రశ్నలో '3'లు గురించి అడిగారు. కాబట్టి '3' 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 2 ఉండటం అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3'కి ఎడమవైపు 2 ఉండాలని అర్థం. తరవాత 4 అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3' కి కుడివైపు 4 ఉండాలి. అనగా 234 అనే సమూహాలు మూడు ఉన్నాయి.

2. కింది సంఖ్యాక్రమంలో ముందు 4 లేకుండా, తరవాత 6గల '5'లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) అయిదు

సమాధానం: (సి)

వివరణ: 6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

పై ప్రశ్నలో '5'లు గురించి అడిగారు. కాబట్టి '5' 'బేసిక్'గా తీసుకోవాలి. తరవాత 6 గల అనగా 5కి కుడివైపు 6 ఉండటం అని అర్థం. అనగా 56. ముందు 4 లేకుండా అనగా 5కి ఎడమవైపు 4 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 56కి ముందు(ఎడమవైపు) 4 లేని సమూహాలు నాలుగు ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 35656 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

3. కింది సంఖ్యాక్రమంలో ముందు 7 ఉండి, తరవాత 9 లేని '8'లు ఎన్ని ఉన్నాయి?

8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

ఎ) మూడు బి) అయిదు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (బి)

వివరణ: 8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

పై ప్రశ్నలో 8లు గురించి అడిగారు. కాబట్టి '8'ని 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 7 ఉండి అనగా 8కి ఎడమవైపు 7 ఉండటం అని అర్థం అనగా 78. తరవాత 9 లేకుండా అనగా 8కి కుడివైపు 9 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 78కి తరవాత (కుడివైపు) 9 లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 78786 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

4. కింద ఇచ్చిన వర్ణమాల క్రమంలో ముందు 'L' ఉండి, తరవాత 'N' లేని 'M' లు ఎన్ని ఉన్నాయి?

J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K

ఎ) 3 బి) 4 సి) 5 డి) ఏమీలేవు

సమాధానం: (ఎ) అవుతుంది.

వివరణ: J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K ఇచ్చిన ప్రశ్నలో ముందు 'L' ఉండి తరవాత 'N' లేని 'M'లు అనగా LM ఉండి 'N' ఉండకూడదు.

Mలు ఎన్ని ఉన్నాయని అడిగారు. కాబట్టి 'M'ని బేసిక్‌గా తీసుకోవాలి. ముందు 'L' ఉండి అనగా 'M'కి ముందు అనగా ఎడమవైపు 'L' ఉండాలి అనగా 'LM'. తరవాత 'N' లేని అనగా 'N' కి కుడివైపు 'N' ఉండకూడదు.



ఈ ప్రశ్నలో Mకు ముందు 'L' ఉండి తరవాత 'N' లేని అక్షర సమూహాలు మూడు ఉన్నాయి. సమాధానం (ఎ) అవుతుంది.

5. కింది వర్ణమాల క్రమంలో ముందు A లేకుండా, తరవాత C లేకుండా గల 'B'లు ఎన్ని ఉన్నాయి?

C D B A G C B B D F C B A B C E B A B G

ఎ) అయిదు బి) మూడు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (ఎ)

వివరణ: C D B A G C B B D F C B A B C E B A B G

పై ప్రశ్నలో 'B'లు గురించి అడిగారు. కాబట్టి Bను 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు A లేకుండా అనగా 'B'కి ఎడమవైపు A ఉండకూడదు. తరవాత 'C' లేని అనగా 'B' కి కుడివైపు 'C' ఉండకూడదు. ప్రశ్నలో ఇచ్చిన ప్రతి 'B'ని పరిశీలిస్తే Bకి ఎడమవైపు Aలేని, Bకి కుడివైపు 'C' లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనిక: పై సిరీస్‌లో CBBD అనే 4 అక్షరాలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కళాశాలల్లో ఇదేం సంస్కృతి?!

ర్యాగింగ్‌ను మించి వికృత చేష్టలు

- విద్యార్థినులపై అసభ్య కామెంట్లు
- గంజాయి, డ్రగ్స్‌పైనే ఎక్కువ చర్చ
- కాలేజీల్లో చేయిదాటుతున్న పరిస్థితి
- ప్రైవేటు వర్సిటీల్లోనూ పెడపోకడలు
- అడ్డుకట్ట వేయకపోతే ప్రమాదమే
- గ్రీవెన్స్ కమిటీలపై పర్యవేక్షణ నిల్
- ఫిర్యాదులు పట్టని యాజమాన్యాలు
- ఏఐసీటీఈ, యూజీసీ నిబంధనలు గాలికి

అది విజయవాడ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొంది అందులో చేరిన ఒక విద్యార్థినికి రెండు రోజులకే చేదు అనుభవం ఎదురైంది. కొందరు విద్యార్థులు ఆ అమ్మాయిని భౌతికంగా తాకే ప్రయత్నం చేశారు. ఆమెను తరగతి వాట్సాప్ గ్రూపులో చేర్చి అసభ్యకరమైన కామెంట్లు చేశారు. ఇవన్నీ చూసి భయాందోళన చెందిన ఆ విద్యార్థిని దీనిపై అధ్యాపకులకు ఫిర్యాదు చేసింది. అయితే "కాలేజీల్లో ఇవన్నీ రొటీన్... పట్టించుకోకూడదు..." అని యాజమాన్యం నుంచి సమాధానం రావడంతో ఆమె తల్లిదండ్రులు ఆ కాలేజీ నుంచి టీసీ తీసుకొని బయటపడ్డారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినుల దుస్తులపై వెకిలి జోకులు... గంజాయి కోసం ఆరాలు... మరింత కిక్ ఇచ్చే డ్రగ్స్ ఏమిటంటూ చర్చలు... యువత భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కాలేజీల్లో సాగుతున్న ఆందోళనకరమైన ట్రెండ్ ఇదీ.. కళాశాలల్లో చక్కటి నైపుణ్యాలు సొంతం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన విద్యార్థులు పెడదారి పడుతున్నారు. పుస్తకాలు, పరీక్షలు, మార్కుల గురించి కాకుండా గంజాయి, డ్రగ్స్‌పై చర్చిస్తున్నారు. కొందరు విద్యార్థులు వాటి మాయలో చిక్కి మత్తులో చిత్తవుతున్నారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇదే వ్యవహారం నడుస్తోంది. పెద్దగా పేరులేని కాలేజీల నుంచి ప్రముఖ విద్యాసంస్థల వరకూ, కొన్ని ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ ఈ పోకడ నానాటికీ పెరుగుతోంది. ఒకప్పటి ర్యాగింగ్ సంస్కృతి ఇప్పుడు వికృత ధోరణిగా రూపుదాల్చింది. కాలేజీల్లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళా గ్రీవెన్స్ కమిటీలు నామమాత్రంగా మారాయి. కేవలం ఉన్నాయని చూపించుకోవడానికి మినహా అవి ఎందుకూ ఉపయోగపడటం లేదు. అసలు ఫిర్యాదులు కాలేజీని దాటి యూనివర్సిటీ స్థాయికి చేరకుండా కొన్ని యాజమాన్యాలు తొక్కిపెడుతున్నాయి. కళాశాల స్థాయిలోనే పరిష్కారమైనట్లు చూపిస్తున్నా, ఎక్కడా ఫిర్యాదులను పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. తాజాగా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో బయటపడిన రహస్య కెమెరాల వ్యవహారంతో కాలేజీల్లో ఆకృత్యాల వ్యవహారం చర్చనీయాంశమైంది.

◆ ఇవీ నిబంధనలు

కాలేజీల్లో కమిటీల ఏర్పాటుకు సంబంధించి ఏఐసీటీఈ, యూజీసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళలపై వేధింపుల నిరోధక కమిటీ కచ్చితంగా ఉండాలి. భౌతికంగా విద్యార్థులను వేధించినా, ఇబ్బందికరమైన కామెంట్లు చేసినా, కాలేజీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించినా, ఎవరిపై అయినా దుష్ప్రచారం చేసినా ఈ కమిటీలకు ఫిర్యాదు చేయొచ్చు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులతో కూడిన ఈ కమిటీల్లో కనీసం ఐదుగురు సభ్యులు ఉంటారు. అందులో కనీసం ముగ్గురు మహిళలు ఉండాలి. తొలుత కాలేజీ స్థాయిలో ఫిర్యాదులపై విచారణ చేస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత యూనివర్సిటీ కమిటీకి పంపుతారు. అక్కడ రిటైర్డ్ జడ్జి స్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తారు.

◆ కాలేజీల్లో జరుగుతున్నది ఇదీ..

ఏఐసీటీఈ నిబంధనలను కాలేజీ యాజమాన్యాలు నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యార్థినులపై వేధింపులు, విద్యార్థులపై ర్యాగింగ్ చేసినా బాధితులు ఫిర్యాదు చేయడానికే భయపడుతున్నారు. కాలేజీల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతో యాజమాన్యాలు ఈ కమిటీలను నామమాత్రం చేశాయి. తమ కాలేజీలో ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు లేవని చూపించడానికి ప్రయత్నిస్తున్నాయి. అడ్మిషన్లు పెంచుకోవాలని, బ్రాండ్ ఇమేజ్‌ను మెరుగుపర్చుకోవాలని చూస్తున్నాయి. దీంతో ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదనే భావనతో ఎవరూ ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడం లేదు.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

విద్యా రంగంలో ప్రమాణాలు పెంచడంతో పాటు కాలేజీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. గత ప్రభుత్వంలో అటు చదువులు, ఇటు ఫిర్యాదులు రెండింటినీ పట్టించుకోకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగింది. అందువల్లే పేరున్న కాలేజీల్లో కూడా పిల్లలను చేర్పించాలంటే తల్లిండ్రులు భయపడే పరిస్థితి వచ్చింది. రోజూ కాలేజీకి వెళ్లొచ్చే వారికంటే హాస్టళ్లలో ఉండే వారు తొందరగా తప్పుదారి పడుతున్నారు. జూనియర్ కాలేజీలతో పోలిస్తే ఎక్కువ స్వేచ్ఛ ఉండటం, తల్లిదండ్రులు దూరంగా ఉండటం, కాలేజీ యాజమాన్యాల నిర్లక్ష్యంతో ఉన్నత విద్యాసంస్థల్లో వికృత పోకడ పెరుగుతోంది. దీనిపై ఇప్పుడే కఠినంగా వ్యవహరించకపోతే విద్యార్థుల చదువులతో పాటు, రాష్ట్ర ఇమేజ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

వైసీపీ సర్కారు పుణ్యమే

ఉన్నత విద్యాసంస్థల్లో వికృత చేష్టలు ఇప్పుడే కొత్త కాకపోయినా కొంతకాలంగా ఈ ధోరణి పెరగడానికి గంజాయి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి గ్రామస్థాయికీ చేరిపోయింది. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో దీని వినియోగం బాగా పెరిగింది. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని మరీ గంజాయి ఎక్కడ దొరుకుతుందని విద్యార్థులు ఆరా తీస్తున్నారు. గంజాయి వినియోగించి తోటి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు శృతిమించిన కామెంట్లు చేస్తున్నారు. కాలేజీలకు గంజాయి, డ్రగ్స్ చేరకుండా నియంత్రిస్తే, ఇతర వేధింపులు కూడా ఆగే అవకాశం ఉంది.

ముఫ్తీ ఎన్నికల ప్రచారం రద్దు

» హిజ్బుల్లా నేత నస్రల్లా హత్య నేపథ్యంలో నిర్ణయం
» పాలస్తీనా, లెబనాన్ ప్రజలకు సంఘీభావంగా ప్రకటన

శ్రీనగర్, సెప్టెంబరు 29: హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయిల్ అంతమొందించిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆదివారం తన ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. పాలస్తీనా, లెబనాన్ దేశాల ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్న దృష్ట్యా వారికి సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె 'ఎక్స్'లో ప్రకటించారు. మరోవైపు నస్రల్లా హత్యకు నిరసనగా శ్రీనగర్‌లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు శనివారం నల్లజెండాలతో ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించారు. ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేక నినాదాలను హోరెత్తించారు. ఈ ర్యాలీలలో చిన్నపిల్లలు కూడా పాల్గొన్నారని అధికారులు తెలిపారు. కాగా, మెహబూబా ముఫ్తీ ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకోవడం 'రాజకీయ స్టంట్' అంటూ బీజేపీ విమర్శించింది. 'నస్రల్లాను చంపితే ముఫ్తీకి బాధ కలిగింది. మరి బంగ్లాదేశ్‌లో హిందువులను చంపినప్పుడు ఆమె ఎందుకు మౌనంగా ఉన్నారు. ఇదంతా నకిలీ సానుభూతి. ఆమెవి మొసలి కన్నీళ్లు. ప్రజలు అన్నీ అర్థం చేసుకుంటారు' అని బీజేపీ నాయకుడు కవిందర్ గుప్తా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని మరో బీజేపీ నేత అల్తాఫ్ ఠాకూర్ కూడా ముఫ్తీది ఎన్నికల స్టంట్ అంటూ తప్పుబట్టారు. కాగా, నస్రల్లా హత్య నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, మతతత్వ పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని కశ్మీర్ సైబర్ పోలీసులు హెచ్చరించారు. 'మత సామరస్యానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పెట్టిన మతతత్వ, ఉద్రిక్తతలను ప్రేరేపించే పోస్టులను మేం గమనించాం. అలాంటి విద్వేష పోస్టులు పెట్టొద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం' అని ఒక అడ్వైజరీని సైబర్ పోలీసులు 'ఎక్స్'లో పోస్టు చేశారు. శాంతికి విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర మంత్రి నిర్మల రాజీనామా చేయాలి

» కేసు నమోదు నేపథ్యంలో కాంగ్రెస్ డిమాండ్
» ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసింది
» బాండ్ల స్కీమ్ కుట్రతో పలు మార్గాల్లో డబ్బు దోపిడీ
» సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్‌తో దర్యాప్తు జరిపించాలని డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఎన్నికల బాండ్ల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో ఆమె తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ ద్వారా అధికార బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించింది. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, అభిషేక్ మనుసింఘ్వీ ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరిపించాలన్న తమ పార్టీ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. ఈ బాండ్ల కుట్ర ద్వారా 'ముందస్తు లంచం, పని పూర్తయిన తర్వాత లంచం, దాడుల తర్వాత లంచాలు' వంటి తదితర రూపాల్లో డబ్బు దోపిడీ జరిగిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయంగా, న్యాయపరంగా, నైతికంగా ఆర్థిక మంత్రి సీతారామన్ దోషిగా నిలిచారని, ఆమె వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, దీనితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సింఘ్వీ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్రలు చేసిందన్నారు. 'ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దోపిడీని కేంద్ర ఆర్థిక మంత్రి సొంతంగా అయితే చేయలేదు. దీని వెనుక ఉన్న నంబర్ 1, 2లు ఎవరో మనకు తెలుసు. వారి ఆదేశాల మేరకు ఆమె ఇది చేశారు' అని ఆరోపించారు. ప్రజాస్వామ్య మనుగడకు స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు అత్యంత ముఖ్యమని, అయితే మన ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి జరుగుతోందని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను ఆయన 'దోపిడీదారుల బీజేపీ స్కీమ్'గా వర్ణించారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై దాఖలైన పిటిషన్ మేరకు బెంగళూరులోని స్థానిక ప్రత్యేక కోర్టు ఆదేశాలతో పోలీసులు శనివారం సీతారామన్ సహా పలువురు ఈడీ అధికారులు, బీజేపీ జాతీయ, రాష్ట్రస్థాయి నేతలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

'ఆయుష్మాన్ భారత్'లో అర్హులైన వృద్ధులను చేర్చండి

» రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం

Ayushman Bharat Yojana

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' పథకంలో అర్హులైన వృద్ధులను చేర్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 70 ఏళ్లు, ఆ పైన వయసున్న వారిని ఈ పథకంలో చేర్చాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ఎల్.ఎస్.చాంగ్‌సాంగ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ పథకంలో వృద్ధుల నమోదుకు ఆయుష్మాన్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలనుకునే వృద్ధులు యాప్ లేదా పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాదంతా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ పథకం కింద సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆరోగ్య బీమా (ఏడాదికి రూ.5 లక్షలు) వర్తిస్తుందని తెలిపారు. ఆధార్‌లో ఉన్న వయసు ఆధారంగా వృద్ధులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాబిల్లిపై అతి పురాతన బిలం..!

» ఇది 8.35 బిలియన్ ఏళ్ల క్రితం నాటిది.. ల్యాండర్ దిగింది ఇక్కడే: శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఇస్రో ప్రతిష్ఠాత్మక మూన్ మిషన్ చంద్రయాన్-3కు సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. చంద్రయాన్-3 మిషన్, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై ఉన్న అతిపురాతన బిలంపై దిగి ఉండొచ్చని తెలిపారు. సుమారు 160 కిలోమీటర్ల వ్యాసం కలిగిన ఈ బిలం 8.35 బిలియన్ సంవత్సరాల క్రితంనాటి నెక్టేరియన్ కాలంలో ఏర్పడి ఉంటుందని, ఇది చంద్రుని చరిత్రలో అత్యంత పురాతనమైన కాలాల్లో ఒకటని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ, ఇస్రో శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఆ వివరాలను ఇకారస్ అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. 'చంద్రయాన్-3 దిగిన ప్రాంతం మరే ఇతర మిషన్లూ వెళ్లని ఒక ప్రత్యేకమైన భౌగోళిక వాతావరణంలో ఉంది. ల్యాండర్‌లోని ప్రజ్ఞాన్ రోవర్ పంపిన ఈ ప్రాంతానికి సంబంధించిన చిత్రాలు.. కాలక్రమేణా చంద్రుడు ఎలా పరిణామం చెందాడో వెల్లడిస్తాయి' అని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీలో ప్లానెటరీ సైన్సెస్ డివిజన్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్ విజయన్ తెలిపారు. సాధారణంగా ఒక గ్రహాన్ని, లేదా చంద్రుడి వంటి భారీ ఉపరితలాన్ని గ్రహశకలం ఢీకొట్టినప్పుడు బిలం ఏర్పడుతుంది. అలా ఏర్పడిందే ఈ పురాతన బిలమని, విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతానికి దగ్గరలోనే ఇది ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

హీమోఫీలియాకు వరం 'ఎమిసిజుమ్యాబ్'



జీజీహెచ్‌లో హీమోఫీలియా చిన్నారులతో వైద్యులు



డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

- బాధిత పిల్లల చికిత్సకు 30 ఇంజెక్షన్లు
- ఒక్కొక్క ఇంజెక్షన్ ఖరీదు రూ.1.20 లక్షలు
- రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా గుంటూరు జీజీహెచ్ ఎంపిక
- డే కేర్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 29: హీమోఫీలియా వ్యాధిగ్రస్తుల్లో చికిత్సకు ఖరీదైన ఎమిసిజుమ్యాబ్ సూదిమందు ప్రభుత్వ వైద్య రంగంలోకి అందుబాట్లోకి వచ్చింది. వ్యాధితో బాధపడే చిన్నారులకు ఏడాది వ్యవధిలో 30 ఇంజెక్షన్లు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క ఇంజెక్షన్ ఖరీదు రూ.1.20 లక్షలు. రోగి శరీర బరువును బట్టి ఈ మోతాదు పెంచాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏడాదిలో హీమోఫీలియా బాధితుడికి అయ్యే వైద్యం ఖర్చు సుమారు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటుంది. రాష్ట్రంలో తొలిసారిగా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎమిసిజుమ్యాబ్ చికిత్స కేంద్రంగా గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని ఎంపిక చేశారు. తొలి దశలో 15 మంది హీమోఫీలియా చిన్నారులను ఎమిసిజుమ్యాబ్ చికిత్సలకు ఎంపిక చేశారు. గత వారం నలుగురు చిన్నారులకు ఈ చికిత్సలను ప్రారంభించారు. రోగులకు మొదటి నెలలో వారానికి ఒకటి చొప్పున నాలుగు ఇంజెక్షన్లు చేస్తారు. మరుసటి నెల నుంచి 15 రోజులకు ఒక ఇంజెక్షన్ చొప్పున ఏడాది పాటు ఇస్తారు. 15 మంది పిల్లలకు ఏడాది సరిపోయే ఇంజెక్షన్లను ఇప్పటికే గుంటూరు జీజీహెచ్‌కు సమకూరాయి. ఇందుకోసం తొలి దశలో రూ.4.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఫ్యాక్టర్ 8కు ప్రత్యామ్నాయంగా..

హీమోఫీలియా పిల్లల్లో గాయమైతే రక్తస్రావం ఆగదు. కొందరిలో రక్తం గడ్డ కట్టడం, కీళ్లవాపు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు ఫ్యాక్టర్-8 అనే మందును చికిత్సగా ఇస్తారు. ఇది కూడా కొంతకాలం తర్వాత రోగుల్లో సమర్థవంతంగా పని చేయదు. ఇలాంటి వారికి ఎమిసిజుమ్యాబ్ ఇంజెక్షన్‌లను ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఫ్యాక్టర్ 8 మందు పని చేయని పిల్లలకు కూడా ఎమిసిజుమ్యాబ్ సమర్థవంతంగా పని చేస్తుంది. గుంటూరు జీజీహెచ్‌లోనే సుమారు 100 మంది హీమోఫీలియా బాధితులు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతానికి ఎన్‌ఆర్‌హెచ్ కింద ఏపీ శ్యాక్స్ ఎమిసిజుమ్యాబ్ చికిత్సలకు హీమోఫీలియా చిన్నారుల ఎంపికను నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పిల్లలను చికిత్సకు గుంటూరు జీజీహెచ్‌కి పంపుతున్నారు. బాధిత చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో చికిత్సల కోసం విశాఖపట్నం, కడప ప్రభుత్వాస్పత్రులను కూడా ఎంపిక చేశారు.

ప్రభుత్వం అండగా నిలుస్తుంది

ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో హీమోఫీలియా రోగుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హీమోఫీలియా రోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 1100 మంది హీమోఫీలియా బాధితులు ఉన్నారని, వీరికి చక్కటి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్, హీమోఫీలియా సొసైటీ కార్యదర్శి మాగంటి ప్రసాద్ పాల్గొన్నారు.

బీచ్‌కి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- ఎదురెదురుగా ఢీకున్న ఆర్టీసీ బస్సు, టాటాఏస్
- ఇద్దరు మృతి, 9 మందికి గాయాలు



పెనుమూడి - పులిగడ్డ వంతెనపై ఢీకున్న ఆర్టీసీ బస్సు, టాటాఏస్

రేపల్లె, సెప్టెంబరు 29: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, టాటాఏస్ ఢీకున్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, తొమ్మిది మందికి తీవ్ర గాయాలైన సంఘటన పెనుమూడి - పులిగడ్డ వంతెనపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ ఏ.మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. రేపల్లె నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కృష్ణా జిల్లా బందరు మంగినపూడి బీచ్ నుంచి రేపల్లె వైపు వస్తున్న టాటాఏస్ పెనుమూడి - పులిగడ్డ వారధిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రేపల్లె మండలం పెద అరవపల్లి గ్రామానికి చెందిన మాతంగి గంగాధర్ (45), అతని మేనల్లుడు శ్యామ్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. టాటాఏస్‌లో ఉన్న మృతుడు గంగాధర్ భార్య లూథియా, కుమారుడు మనోజ్‌లతోపాటు రత్నకుమారి, సౌజన్య, దున్న కల్యాణ్ బాబు, దున్న శ్రావ్య, బచ్చులపూడి గురవయ్య, బచ్చులపూడి అమ్ములు, బేతపూడి రాజేష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించటంతో ముగ్గురిని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు, మిగిలిన వారిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు మనోజ్, సౌజన్య, రత్నకుమారిని గుంటూరుకు తరలించారు. మృతుడు గంగాధర్ పెద్దనాన్న సంవత్సరికాన్ని శనివారం ముగించుకుని ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా టాటాఏస్ వాహనంలో పది మంది బందరు బీచ్‌కు వెళ్లి వస్తూ ప్రమాదానికి గురైయ్యారు. ఇద్దరు మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పోలీసు సిబ్బంది పరిశీలించి క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



గంగాధర్ (ఫైల్‌ఫొటో)

నాటి త్యాగానికి.. నేడు న్యాయం!

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటికి అవకాశం
- పోటీకి టీడీపీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్



మాజీ మంత్రి ఆలపాటికి మద్దతుగా గుంటూరు కలెక్టరేట్ వద్ద పశ్చిమ ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తెనాలి, గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసేనతో పొత్తులో భాగంగా తెనాలి అసెంబ్లీ సీటును త్యాగం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను శాసనమండలికి పంపాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఎన్డీఏ కూటమి పొత్తులో భాగంగా సీట్లు కోల్పోయిన నేతలకు న్యాయం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకనేత, ఆది నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తగిన న్యాయం చేసేందుకు అధినేత సిద్ధమయ్యారు. ఈ నెల 30తో గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనున్నది. దీంతో ఈ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఆలపాటికి చంద్రబాబు ఇచ్చారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగనుండటంతో పోటీకి ఆలపాటికి అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో ఆలపాటి అభిమానులు, టీడీపీ శ్రేణుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఆలపాటికి నామినేటెడ్ పదవులపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం సాగగా, ఆ ఊహాగానాలకు తెరదింపుతూ అధిష్ఠానం ఆయన్ను మండలికి పంపేందుకు సిద్ధమైంది. 2019 ఎన్నికల్లో తెనాలిలో ఓడిపోయినా ఆలపాటి వెనక్కి తగ్గలేదు. 2024 వరకు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని శ్రేణులను కాపాడుకుంటూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలు చేస్తూ పార్టీని నిలబెట్టుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆలపాటికి సీటు ఇవ్వకపోవడంతో ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు నిరుత్సాహం వ్యక్తం చేశారు. సీటు లభించని పరిస్థితుల్లో నిరుత్సాహపడకుండా అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తూ, తన క్యాడర్‌కు ధైర్యం చెబుతూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అవకాశం లభించనున్నదనే సమాచారంతో ఆలపాటి అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీ సీటును త్యాగం చేసిన ఆలపాటి

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం- జనసేన- బీజేపీలు ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యాయి. పొత్తులో భాగంగా అసెంబ్లీ సీట్లను మూడు పార్టీలు పంచుకున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి సీటు జనసేనకు వెళ్లింది. జనసేనలో కీలకనేత, పీఏసీ ఛైర్మన్ అయిన మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆలపాటి రాజా తెనాలి సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. అయితే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలు అప్పట్లో వెలువడ్డాయి. కానీ సామాజిక సమీకరణాలు కలిసి రాకపోవడంతో ఆయన అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. పొత్తులో సీటు కోల్పోయినా తెనాలి నుంచి పోటీ చేసిన జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. విద్యార్థి దశ నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న ఆలపాటి, కీలక సమయంలో త్యాగానికి సిద్ధపడడంతో అధిష్ఠానం ఆయన త్యాగాన్ని గుర్తించింది. ఎన్నికల ప్రచార సమయంలో అధినేత హామీ ఇచ్చినట్లు ఆలపాటికి ప్రస్తుతం ఎమ్మెల్సీ బరిలో పోటీ చేసే అవకాశం కల్పించింది. 2024 ఎన్నికల్లో తెనాలి నుంచి పోటీకి సిద్ధమైనా అధిష్ఠానం ఆదేశాలతో తప్పుకున్న ఆయనకు ప్రస్తుతం పెద్దల సభకు వెళ్లే అవకాశం దక్కింది.

బైకును ఢీకున్న కారు: వృద్ధుడి మృతి

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిపై ఆదివారం మధ్యాహ్నం కావూరు కోమటినేనివారిపాలెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగన్నపాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు మరణించాడు. ఇతడు చిలకలూరిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పాల వ్యాపారం చేసుకునే గుంజి రామారావు(68)గా గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీడీసీసీ బ్యాంకు నూతన పాలకవర్గ ఎంపిక



శ్రీనివాసన్



బాలాజీ ప్రసాద్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29: జీడీసీసీ బ్యాంకు ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం తెనాలిలో నిర్వహించారు. బోసురోడ్డులోని జీడీసీసీ బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షునిగా సుంకర శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి ఓలేరు బాలాజీప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా మహేంద్రరావు, కోశాధికారిగా దొప్పలపూడి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సమావేశంలో వేతన సవరణ, ఉద్యోగులకు పదవీ విరమణ వయసు పెంపు, బీమా సౌకర్యం, బదిలీలు నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేశారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



లాంచీలో కొండకు వెళ్తున్న పర్యాటకులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 29: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి పర్యాటకులు వివిధ లాంచీలలో నాగార్జున కొండకు చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, బోధివృక్షంను సందర్శించారు. అనంతరం అనుపులో యాంపీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, రంగనాథస్వామి ఆలయం వీక్షించారు. 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. పర్యాటకుల రాకతో లాంచీ స్టేషన్‌కు రూ.42 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

వైసీపీ నాయకుడిపై రౌడీషీట్

బాపట్ల, సెప్టెంబరు 29: పట్టణ వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడు జోగి రాజాపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియా ద్వారా అనేక పోస్టులు పెట్టటంతోపాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, అంతేగాక వివిధ నేరాలకు పాల్పడినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇప్పటి వరకు 7 కేసులు ఆయనపై నమోదు అయ్యాయి. తాజాగా టీడీపీ శ్రేణులను టార్గెట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడంటూ టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు వేర్వేరుగా అతనిపై కేసులు పెట్టారు. పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పట్టణ సీఐ ఆర్.అహ్మద్ జానీ ఈ సందర్భంగా తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ పీఈటీ మృతి

వినుకొండ టౌన్, సెప్టెంబరు 29: డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల్లో పీఈటీగా పనిచేస్తున్న మెర్ల అప్పారావు (35) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య మాణిక్యం ఉంది. ప్రభుత్వ పాఠశాల్లో పీఈటీగా పని చేస్తున్నారు. వీరికి బాబు, పాప సంతానం కలరు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: పొన్నూరు పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం యువకుడు మృతి చెందాడు. అర్బన్ పోలీసు కథనం ప్రకారం పట్టణంలోని సజ్జా కల్యాణ మండపం సమీపంలో ఈతేరు వైపు నుంచి పొన్నూరు వస్తున్న ఆటో, పొన్నూరు వైపు నుంచి చింతలపూడి వైపు వెళ్తున్న బొలెరో వ్యాన్ ఢీకొన్నాయి. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న తెనాలి మండల సంగం జాగర్లమూడికి చెందిన జిల్లపోగుల రాజేష్ బాబు (30) సంఘటనా స్థలంలోనే తీవ్రంగా గాయపడి మృతి చెందాడు, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 29: రైలు నుంచి జారిపడిన గుర్తుతెలియని వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటాద్రి ఆదివారం తెలిపారు. గత శుక్రవారం న్యూఢిల్లీ-త్రివేంద్రం కేరళ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తుతెలియని యువకుడు తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలోని చిలువూరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై జారి పడ్డాడు. రైల్వే సిబ్బంది 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి 35 సంవత్సరాలు ఉంటాయి. బ్లూ టీషర్ట్, గళ్ల ప్యాంట్ ధరించి ఉన్నాడు. వైద్యుల రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఏఎన్‌యూకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



పెదకాకాని, సెప్టెంబరు 29: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు నేడు (సోమవారం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రానున్నారు. తత్వవేత్త కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా 'పద్మవిభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి విజన్ అండ్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించనున్నారు. ఉదయం 10.30 గంటలకు వర్సిటీలోని డైక్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు అధ్యక్షత వహించనున్నారు. సదస్సుకు వెంకయ్య నాయుడుతోపాటు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం హాజరవుతారని అన్నారు . ఈ సదస్సులో ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అశోక్ వోహ్రా కీలకోపన్యాసం చేయనున్నారు.

జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి ..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు నిర్వహణకు వర్సిటీ ముస్తాబైయింది. వర్సిటీ అధికారులు వర్సిటీ ముస్తాబు చేసి సర్వం సిద్ధం చేశారు. ప్రధాన వేదికపై అతిథుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. సదస్సును విజయవంతం చేసేందుకు ఉపకులపతి ఆచార్య గంగాధరరావు ఎనిమిది కమిటీలను నియమించారు. ఆదివారం వర్సిటీ లోని ఆడిటోరియాన్ని వీసీ గంగాధర్‌రావు, రిజిస్ట్రార్ సింహాచలం, సదస్సు కన్వీనర్ త్రిమూర్తిరావు, కమిటీ కన్వీనర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పరిశీలించారు.

సమగ్ర అవగాహనకు ఉపకరించే శిక్షణ

- జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసు



జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, డీఎల్‌డీవో శిక్షణ తరగతుల్లో చార్ట్ ద్వారా వివరిస్తున్న రిసోర్స్ పర్సన్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 29 : గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ శాఖా పరమైన అంశాల సమగ్ర అవగాహనకు శిక్షణా తరగతులు దోహద పడతాయని జడ్పీ సీఈవో వి. జ్యోతిబసు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మూడు రోజుల ముగింపు శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులలో రిసోర్స్ పర్సన్ బొంతా సుబ్బారావు మాట్లాడుతూ పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, నిబంధనలపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో ఎదుర్కొనే న్యాయ పరమైన అంశాలను ప్రస్తావించారు. పి.నాగానంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వీధి దీపాల నిర్వహణ అందరికీ అవగాహన కల్పించారు. దీంతో శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కంచర్ల నాగేశ్వరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నిరంజన్‌రావు, కరిముద్దీన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మత కలహాలు రాకూడదనే పవన్ కల్యాణ్ దీక్ష



హోమంలో గాదె వెంకటేశ్వరరావు, చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 29: తిరుమల శ్రీవారి దివ్య ప్రసాదానికి అపచారం జరిగిందని విషయం తెలియగానే భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదని, మత కలహాలు రాకుండా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఆదివారం మంగళగిరి ఘాట్ రోడ్డులోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శాంతి హోమం నిర్వహించారు. జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ శుద్ధి, విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, అగ్ని ప్రతిష్ఠ, కలశ ఆరాధన, శాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గాదె, చిల్లపల్లి మాట్లాడుతూ భారతదేశంలో గొప్పదైన సనాతన ధర్మాన్ని ఒక మతానికి ఆపాదించి వికృత చేష్టలకు ఒడిగడుతున్నారని విమర్శించారు. జనసేన పార్టీ ఏనాడూ కులాల్ని వెనకేసుకు రాలేదని, అలాంటి వ్యక్తి దీక్ష చేస్తుంటే విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏ మతానికి అపచారం జరిగినా పవన్ ముందుండి నిలదీస్తారని స్పష్టం చేశారు. జనసేన పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

ఎక్సైజ్ శాఖలో భారీగా సీఐల బదిలీలు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 29: ఎక్సైజ్ శాఖలో సీఐల బదిలీలు భారీగా జరిగాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

గుంటూరు జిల్లాలో.. బి.లత గుంటూరు-1కు, వై.యశోదరా దేవి గుంటూరుకు, వై. అశోక్ కుమార్ ప్రత్తిపాడుకు, జి.వీరాంజనేయులు మంగళగిరికి, ఏవీ.చలం తెనాలికి, ఎం. రమేష్ పొన్నూరుకు బదిలీ అయ్యారు.

బాపట్ల జిల్లాలో.. పి.గీతిక బాపట్లకు, ఆర్ దివాకర్ రేపల్లెకు, ఏ.రవి వేమూరుకు, ఎం.శ్రీరాం ప్రసాద్ నగరంకు, పి.నాగేశ్వరరావు చీరాలకు, ఎం.భుజంగరావు పర్చూరుకు, ఏ.భవాని అద్దంకి బదిలీ అయ్యారు.

పల్నాడు జిల్లాలో.. కె.సోమయ్య నరసరావుపేటకు, కొడాలి విజయ్ కుమార్ చిలకలూరిపేటకు, పి. విజయ్ కుమార్ సత్తెనపల్లికి, టి.తులసి క్రోసూరుకు, కె.కర్ణ పిడుగురాళ్లకు, కె.బుజ్జి బాబు గురజాలకు, ఎన్.వెంకటరమణ మాచర్లకు, డి.వెంకటేశ్వర్లు ఈపూరుకు, వి. శ్రీనివాసులు పెదకూరపాడుకు బదిలీ అయ్యారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అధ్వానంగా దొడ్లేరు-బెల్లంకొండ రహదారి

మరమ్మతులు నిర్వహించాలని ఎమ్మెల్యేకు సీపీఎం నాయకుల వినతి



అధ్వానంగా ఉన్న దొడ్లేరు - బెల్లంకొండ ఆర్‌అండ్‌బీ రహదారి

క్రోసూరు, సెప్టెంబరు 29: దొడ్లేరు నుంచి బెల్లంకొండ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గంజిమాల రవిబాబు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ రహదారిలో భారీ వర్షాలకు గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, కనీసం బస్సులో ప్రయాణం చేయాలన్నా ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు రెండు లైన్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు దొడ్లేరు వరకు మాత్రమే జరుగుతున్నాయని, దొడ్లేరు నుంచి బెల్లంకొండ వరకు ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

మహిళలకు కుట్టు శిక్షణ

నకరికల్లు, సెప్టెంబరు 29: స్వయం ఉపాధితో ఎదగాలనుకునే గ్రామీణ మహిళలకు టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ తెలిపారు. అక్టోబరు 14వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. నెల రోజుల శిక్షణా సమయంలో ఉచితంగా హాస్టల్ వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఈ శిక్షణలో చేరవచ్చన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు బ్యాంకు రుణం పొందడానికి అవసరమైన సహకారం అందించనున్నట్టు చెప్పారు. వివరాలకు 9700687696, 8125397953, 9949930155 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జనవాణి ద్వారా సమస్యలకు పరిష్కారం



జనసేన మండల అధ్యక్షుడు చలపతిరావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెదకూరపాడు, సెప్టెంబరు 29 : జనవాణి ద్వారా సమస్యలను స్వీకరించి ఆ సమస్యలను పరిష్కరించేలా చూస్తామని మండల జనసేన అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని కాశిపాడులో ఆదివారం జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ల స్ఫూర్తితో జనవాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వివిధ రకాల సమస్యలతో కూడిన వినతిపత్రాలను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్రె సాంబయ్య, జనసేన నేతలు కొత్తంశెట్టి యాదెయ్య, రమేష్, హనుమంతరావు, యశ్వంత్, బుచ్చిబాబు, సాంబయ్య, టీడీపీ నేతలు సిద్దంశెట్టి సాంబశివరావు, కొత్తంశెట్టి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

తెనాలిలో తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక రేపు

సత్తెనపల్లి, సెప్టెంబరు 29 : గుంటూరు జిల్లా అండర్ - 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెనాలిలోని డీఎస్‌ఏ స్టేడియంలో అక్టోబరు ఒకటో తేదీ తైక్వాండో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని అండర్- 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనవరి 1, 2006 తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితాతో హాజరుకావాలని కోరారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్మన్ నరసింహారావు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలించారు. ఉదయాన్నే వార్డుల్లోకి వెళ్లి పారిశుధ్య సిబ్బంది పని తీరును పరిశీలించారు. ప్రధానంగా 27, 31 వార్డులతోపాటు రామా టాకీస్‌లైన్‌లో సైడు కాలువల్లో పారిశుధ్య కార్మికులు పూడిక తీత పనులు చేపట్టారు. వీధుల వెంట చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారావు పారిశుధ్య కార్మి కులకు పలు సూచనలు చేశారు.

స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు



పేటసన్నిగండ్లలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

కారంపూడి, సెప్టెంబరు 29 : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు పాఠశాలల విద్యార్థులతో పాటలు పాడించి బాషా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, కోఆర్డినేటర్ సుబ్బారావు, మాజీ ఉప ఎంపీపీ చావా వీరాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వైద్యులతో నెట్టుకొస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్లు

● సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మాచర్లటౌన్, సెప్టెంబరు 29: కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాచర్ల లోని 4వ వార్డు, పాత మాచర్లలోని జెండా చెట్టు, 10వ వార్డులోని గౌడకాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు గతేడాది బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి వైద్యులతో నెట్టుకొస్తున్నారని, పూర్తిస్థాయి వైద్యులను ఏర్పాటు చేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పనుల ద్వారా కార్పొరేట్ స్థాయిలో వైద్యశాలలను తీర్చిదిద్దుతున్నామంటూ గొప్పలు చెప్పి పేదలకు వైద్య సేవలందించేందుకు పూర్తి స్థాయి వైద్యులను నియమించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో వైద్యులతోపాటు సిబ్బందిని, మౌలిక వసతులు కూడా కల్పించాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.

ఆక్రమణలు తొలగించాలి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 29 : ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద డేంజర్ జోన్‌గా గుర్తించిన ఆయా ప్రాంతంలో రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. గ్యాస్ గోడౌన్‌కు వెళ్లే దారి నుంచి పంతులు గారి మిల్లు వరకు ఆర్‌అండ్‌బి స్థలాన్ని ఆక్రమించు కొని దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తుండటంతో ఆ ప్రాంతంలో రహదారి ఇరుకుగా మారిందని, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొని డేంజర్ జోన్‌గా గుర్తించిన ఆ ప్రాంతంలో రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రమాదాలు కాకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

లక్షలు ఖర్చు చేసినా.. తరగతి గదులకు లీకులు

● నాడు-నేడు పథకంతో రూ.20 లక్షలు ఖర్చు

● పైపైన మెరుగులు మాత్రమే చేశారు



రామాపురం ప్రాథమిక పాఠశాలలో పెచ్చులు ఊడిన శ్లాబు

దాచేపల్లి, సెప్టెంబరు 29: పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పక్కా భవనాలు ఉండాలనే లక్ష్యంతో లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అయినప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోయారు. వివరాల్లోకి వెళ్తే.. దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతి గదులు వున్నాయి. ఈ తరగతి గదులకు నాడు-నేడు పథకం కింద రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. రూ.20 లక్షలతో పాఠశాల భవనాలు అందంగా కనిపించేలా రంగులు అద్దారు. రంగు రంగుల బల్లలు తీసుకొచ్చారు. మెరుస్తున్న ఫ్యాన్లు బిగించారు. కంటికి ఇంపుగా చిత్రాలను గీయించారు. కానీ గదులకు ఉండాల్సిన శ్లాబులు నాణ్యత లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు శ్లాబు నుంచి నీరు కారి తరగతి గదులు నీటిమయంగా మారుతున్నాయి. వర్షం తగ్గినా పాఠశాల శ్లాబు నుంచి వారం రోజులపాటు నీరు పడుతున్నాయి. చేసేది లేక ఉపాధ్యాయులు కారుతున్న తరగతి గదులను వాడకుండా మిగిలిన తరగతి గదుల్లోకి పిల్లలను సర్దుబాటు చేసి పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఖర్చు పెట్టిన లక్షలు పాఠశాల నిర్మాణాలకు ఉపయోగించ కుండా నేతల జేబుల్లోకి వెళ్లాయా అనేది విద్యార్థుల తల్లిదండ్రుల్లో చర్చ జరుగుతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



కారిన వర్షపునీరు తరగతి గదుల్లో బండలపై నిల్వవున్న దృశ్యం

ఈ పంట నమోదులో రైతులకు ఇబ్బంది

నకరికల్లు, సెప్టెంబరు 29: ఈ పంట నమోదు చేసుకునే విషయంలో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తెలుస్తుంది. గ్రామ సచివాలయాల వారీగా రైతుల సమాచారాన్ని ఆన్‌లైన్ డేటాలో పొందుపరిచారు. ఒకే రైతుకు రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో పొలం ఉన్న చోట రెండు సచివాలయాలకు వెళ్ళి ఈ క్రాపును నమోదు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరికొన్ని సందర్భాల్లో ఏ సచివాలయంలో ఏ సర్వే నెంబరు వరకు ఉందో తెలుసుకోవటంలో రైతులకు ఇబ్బంది ఎదురవుతుంది. సర్వే నెంబర్ల వారీగా కాకుండా రైతులకు ఖాతా నెంబర్ల ద్వారా కనుక సచివాలయాల వారీగా కేటాయిస్తే రైతులు రెండు సచివాలయాలకు వెళ్లే పని తప్పుతుంది. లేకుంటే ఒకే గ్రామంలో రెండు సచివాలయాలు ఉన్న చోట రెండు వేర్వేరు ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు రెండు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఒక గ్రా మానికి సంబంధించిన రైతుల పూర్తి సమాచారాన్ని రెండు సచివాలయాల్లో ఉండే వ్యవసాయ శాఖ సహాయకులకు వారి లాగిన్‌లలో అందుబాటులో ఉంచినట్లయితే ఎక్కడ అవకాశం ఉన్న రైతులు ఆ సచివాలయ పరిధిలో తమ ఈ క్రాపు నమోదును చేసుకొనే అవకాశం కలుగుతుంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఒకటి కంటే ఎక్కువ సచివాలయాలు ఉన్న గ్రామాల్లో ఆ గ్రామానికి సంబంధించిన డేటానంతా వీఏఏల లాగిన్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

25 మినీ గోకులాలు మంజూరు

రెంటచింతల, సెప్టెంబరు 29 : మండలానికి 25 మినీ గోకులాలు మంజూరయ్యాయని పశువైద్యాధికారి డాక్టర్ బషీర్ చెప్పారు. అక్టోబరు 10వ తేదీ లోగా పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 29: మండలంలోని నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె మాధవీలత, పీఈటీలు కే సునీత, సీహెచ్ గోవర్దన, శాస్త్రిలు ఆదివారం విలేకరలకు తెలిపారు. సీనియర్స్ విభాగంలో డిస్కస్‌త్రోలో ఎం దీపిక ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో టీ మహా లక్ష్మి ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో ఎం దీపిక విజయం సాధించారని వారు తెలిపారు. జూనియర్స్ విభాగంలో 600 మీటర్ల పరుగుపందెంలో ఐ వైష్ణవి ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగుపందెంలో ఐ వైష్ణవి ప్రథమ స్థానం, టీ హేమలత ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో టీ హేమలత ప్రథమ స్థానం సాధించారని వారు తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత : వ్యక్తి అరెస్టు

మాచవరం, సెప్టెంబరు 29 : తెలంగాణనుంచి అక్రమంగా మద్యం బాటిళ్ళు తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ సతీష్ ఆదివారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోర్జంపాడు గ్రామానికి చెందిన ముంగి వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తుండగా దాడి చేసి అతని వద్ద ఉన్న 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

దుర్భాషలాడిన వ్యక్తిపై కేసులు

మాచవరం, సెప్టెంబరు 29: మండలంలోని రేగులగడ్డలో ఒక వ్యక్తి మద్యం తాగి ఇద్దరు వ్యక్తులను దుర్భాషలాడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బలగాని చినవెంకటేశ్వర్లు మద్యం తాగి మసీదు వద్ద ఉన్న షేక్ సైదా వలిని దుర్భాషలాడాడు. సదరు విషయాన్ని వలి పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఎస్‌ఐ సతీష్ కానిస్టేబుల్‌ని గ్రామానికి పంపించాడు. కానిస్టేబుల్ పాండు రంగారావును కూడా చిన వెంకటేశ్వర్లు దుర్భాషలాడుతూ చొక్కా పట్టుకొని నిలదీశాడు. సైదా వలి, కానిస్టేబుల్ ఫిర్యాదుల మేరకు చిన వెంకటేశ్వర్లుపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 29 : వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ఆదివారం అనన్య ఆస్పత్రి ఆధ్వర్యంలో సత్తెనపల్లి సబ్ డివి జన్‌లోని పోలీసులకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లా నాగరాజారెడ్డి మాట్లాడుతూ 24 గంటలు ప్రజల కోసం శ్రమిస్తున్న పోలీసులకు ఉచితంగా వైద్య పరీక్ష లు చేయించాలని డీఎస్పీ హనుమంతరావు కోరటంతో ఆయన కోరిక మేరకు శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



తేరు ప్రదక్షిణలో భక్తులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 29: మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన దివ్యబలిపూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తేరు ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు భారీగా రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

ఎక్సైజ్ సీఐగా విజయకుమార్



పీ విజయకుమార్

సత్తెనపల్లి, సెప్టెంబరు 29: సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐగా పీ విజయకుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు వన్ టౌన్ నుంచి బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. మత్తు పదార్థాలను, గంజాయిని అరికట్టడానికి అంకిత భావంతో పని చేస్తానని విజయకుమార్ తెలిపారు.

రైల్వే ప్యాసింజర్లకు అవగాహన కార్యక్రమం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 29: పిడుగురాళ్ల రైల్వే ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్యాసింజర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీసు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.ఏడుకొండలు, హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు, మోహన్‌రెడ్డి, సురేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు 139కు కాల్ చేయాలని సీఐ ఏడుకొండలు తెలిపారు.

మాణిక్యరావుకు సన్మానం



పిల్లి మాణిక్యరావును సన్మానించిన సత్తెనపల్లి టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 29: రాష్ట్ర లీడ్ క్యాంప్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యరావును సత్తెనపల్లి టీడీపీ నేతలు ఆదివారం ఆయన గృహంలో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. వారిలో బలిజేపల్లి సురేష్‌కుమార్, బండారు నాగరాజు, బండారు ఏలియా, తాళ్ళూరి స్వామిలు ఉన్నారు.

బాధితులకు రగ్గులు, దుప్పట్ల పంపిణీ



వరద బాధితులకు దుప్పట్లు, ఆహార పదార్థాలు అందిస్తున్న హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంచర్ల బుల్లిబాబు తదితరులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 29: పట్టణానికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎస్‌ఆర్‌డీజే స్కూల్ ప్రధానోపాధ్యాయిని వేమూరి రాధారాణి వరద బాధితులకు ఆదివారం విజయవాడ వెళ్లి దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. విజయవాడలోని సింగ్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ముంపు భారినపడిన కుటుంబాలకు ఆహార పొట్లాలు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పిల్లలకు ఆహార పదార్థాలను అందించారు. కార్యక్రమంలో సురేష్, గుంటూరు మంజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 29: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు పొందిన పలువురు ఉపాధ్యాయులకు ఆదివారం పిడుగురాళ్ల దొప్పలపూడి దేవరత్నం ఎస్‌టీయూ భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎస్టీయూ ఏపీ పూర్వపు అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, కె.కోటేశ్వరరావు, ఎల్‌వీ రామిరెడ్డి, చంద్రజిత్ యాదవ్, కుంభా రామలింగయ్య, పి.స్వామి, బి.సత్యనారాయణతో పాటు మరికొందరు నేతలు హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

బెల్లంకొండ లూర్దురాజు సేవలు చిరస్మరణీయం

● తహసీల్దార్ ఎం భవానీ శంకర్

ముప్పాళ్ళ, సెప్టెంబరు 29: బెల్లంకొండ లూర్దురాజు గ్రామానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తహసీల్దార్ ఎం భవానీ శంకర్ అన్నారు. లూర్దురాజు ప్రథమ వర్థంతి సం దర్భంగా తురకపాలెంలోని ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో ఎల్ వీ ప్రసాదు ఇన్‌స్టిట్యూట్ ధూళిపాళ్ళ వైద్యబృందం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంకొండ లూర్దురాజు గ్రామ సర్పంచ్‌గా, ధూళిపాళ్ళ సొసైటీ డైరెక్టరుగా గ్రామస్థులకు ఆయన అందించిన సేవలకు గుర్తుగా ఆయన కుటుంబసభ్యులు ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 29: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 588.90 అడుగులు ఉంది. ఇది 308.76 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5438 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 43,024 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 43,024 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 29: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎం సీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,285 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 36,957 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు కృష్ణానదికి విడుదల అవుతుంది.

కేంద్ర మంత్రి పెమ్మసానితో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌తో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల టౌన్, సెప్టెంబరు 29: గుంటూరులోని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఇంజనీర్లు బదిలీ

రెంటచింతల, సెప్టెంబరు 29 : మండలంలోని పలు సాగునీటి మేజర్లకు సంబంధించి ఏఈ, డీఈలను బదిలీ చేస్తూ ఇరిగేషన్ శాఖకు చెందిన ఇంజనీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్) కె.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గవాగు ఏఈఈగా ఉన్న ఎం.రమణయ్యను వెల్లటూరుకు, డీఈ లింగమూర్తిని నకరికల్లుకు, గురజాల సెక్షన్ 2లో పని చేస్తున్న ఏఈఈ ఎ.వెంకట సుబ్బయ్యను సాగర్ మెయిన్ కెనాల్‌కు, గురజాల 1 సెక్షన్‌లో పని చేస్తున్న ఏఈఈ కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డిని మాచర్ల క్యాంప్‌నకు, మల్లవరం మేజర్ ఏఈఈ హిమబిందును వీపీ సౌత్ క్యాంప్ కాలనీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దశబంధుకాలువ ఏఈగా ఉన్న పి.సుధాకర్‌రావును ద్వైద మేజర్‌కు ఇన్‌చార్జిగా నియమించారు.

జాషువా సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొలిపారు

● రాష్ట్ర గుకుల పాఠశాలల సంఘం కార్యదర్శి రాసంశెట్టి

● వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు పురస్కారాల ప్రదానం



జాషువా సేవాసాహితీ సమాఖ్య పురస్కారాలు పొందిన వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు

క్రోసూరు, సెప్టెంబరు 29 : గుర్రం జాషువా తన సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొలిపారని రాష్ట్ర గురుకుల పాఠశాలల సంఘం కార్యదర్శి రాసంశెట్టి నరసింహారావు అన్నారు. విశ్వనరుడు జాషువా సేవాసమితి సమాఖ్య 23వ వార్షికోత్సవం ఆదివారం క్రోసూరులోని జైభారత్ హైస్కూల్ ఆడిటోరియంలో కన్నుల పండువగా జరిగింది. సామాఖ్య వ్యవస్థాపకులు ముట్లూరి వెంకయ్య ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించగా రాసంశెట్టి నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు సేవా సాహితీ సమాఖ్య పురస్కారాలు అందజేశారు. నరసింహారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి తరానికి ఆయన రచనలు ఆదర్శం కావాలన్నారు. ఆయన రచించిన గబ్బిలం, ముంతాజ్ మహల్, ఫిరదౌసి వంటి నవలలు ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేశా యన్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయిత ఊటుకూరి ప్రసాదరావు మాట్లాడుతూ జాషువా రచనలు అజరామరం అన్నారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో - 2 గణేష్ జాషువా సాహిత్యం గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందజేసిన ఊటుకూరి ప్రసాదరావు, కాటూరి ప్రసాదరావు, మన్నెం శ్రీనివాసరావు, శిఖా శ్యామ్‌సన్, తిరుమలరెడ్డి, అనుమాల పూర్ణ చంద్రరరావు, సాయి రామ్‌రెడ్డిలను సత్కరించారు. పూలమాలలతోను, జ్ఞాపికల తోను, శాలువాలతోను, కిరిటీలతోను వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జైభారత్ విద్యా సంస్థల డైరెక్టర్ పీ జయనేంద్రారెడ్డి, వేల్పూరు మాజీ సర్పంచ్ పొన్నెకంటి శివయ్య, అందుకూరు మాజీ సర్పంచ్, ఉపాధ్యాయుడు బాబూరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కల్లోలం సృష్టించడమే జగన్ ఆలోచన

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు

సత్తెనపల్లి, సెప్టెంబరు 29: రాష్ట్రంలో కల్లోలం సృష్టించడమే జగన్ ఆలోచన అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిక్లరేషన్‌లో మాత్రం సంతకం చేయటం ఇష్టం లేని వైఎస్ జగన్ తిరుపతి పర్యటనను రద్దు చేసుకొని చంద్రబాబునాయుడు మీద నిందలు వేయటం తగదన్నారు. హిందూమతం గురించి విమర్శనాత్మకంగా మాట్లాడాడన్నారు. ఐదేళ్ల జగన్‌పాలనలో అన్ని వర్గాల ప్రజలపై వైసీపీ నేతలు దారుణంగా వ్యవహరించారన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. జగన్ ఇప్పుడు శాంతి భద్రతల గురించి మాట్లాడటం అతడి దివాళాకోరు రాజకీయానికి నిదర్శనం అన్నారు. జగన్ పాలనపై విసుగు చెందిన ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేసినా తన ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు మస్తాన్‌వలి, జింకా లోకేశ్వరరావులు ఉన్నారు.

జగన్‌కు భక్తి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ఇవ్వరు?

పెదకూరపాడు, సెప్టెంబరు 29: వెంకటేశ్వర స్వామిపై భక్తి ఉంటే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ సంప్రదాయాలపైన గానీ, వెంకటేశ్వర స్వామిపైన గానీ జగన్‌కు ఎటువంటి భక్తి లేదనే విషయం అర్థమైందన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

ముప్పాళ్ళ, సెప్టెంబరు 29: మండలంలోని గోళ్ళపాడులో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు నలుగురు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, పాఠశాల పీఈటీ యనమాల రాణి ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామలో జరిగిన నియోజకవర్గ స్థాయి హేమర్ త్రో పోటీల్లో అండర్ - 17 విభాగంలో శ్రీలక్ష్మి మొదటి స్థానం సాధించగా డీ సోని రెండో స్థానం సాధించిందని, షాట్‌పుట్ అండర్ - 17 విభాగంలో డీ సోనీ రెండో స్థానం, అండర్ - 14 విభాగంలో హనీల రెండో స్థానం, అండర్ - 17 చెస్ విభాగంలో సుష్మిత రెండో స్థానాన్ని సాధించిందని తెలిపారు. వీరితో పాటు పలువురు విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

నియోజకవర్గస్థాయి పోటీలకు కిడ్స్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాచర్ల టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పట్టణంలోని కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం జొన్నలగడ్డ రామకృష్ణ శాస్త్రి తెలిపారు. అండర్-17 విభాగం చెస్ పోటీల్లో చంద్రమహేష్, వేముల ఆనంద్, భార్గవ శ్రీనివాస్‌నాయక్, అండర్-14 విభాగం చెస్ పోటీల్లో తులసీరామ్, పవన్‌సాయిరెడ్డి, ఈశ్వర్‌రేవంత్, సీనియర్ బాడ్మింటన్‌లో చల్లా విజయ్ చక్రవర్తి, యశ్వంత్‌కుమార్, బాలికల అండర్-14 చెస్ పోటీలో హారిక తమ ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, పవన్, పీఈటీ రామారావు, ఆనంద్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 5కే వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, కారసాని శ్రీనివాసరెడ్డి, నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

నరసరావుపేటలో కోలాహలంగా 5కే వాక్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలో మహాత్మాగాంధీ హాస్పటల్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం నిర్వహించిన 5 కిలోమీటర్ల నడక ఆదివారం కోలాహలంగా జరిగింది. 5కే వాక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం నుంచి మల్లమ్మ సెంటర్ మీదుగా స్టేడియం వరకు ఈ నడకను నిర్వహించారు. డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, డాక్టర్ రామ్‌ప్రసాద్, గంగుల పెద్దిరెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, పొన్నపాటి ఈశ్వరరెడ్డి, రావిళ్ల నాగేశ్వరరావు, కనుమూరి లక్ష్మి, వైద్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



శ్రీ దత్త వైద్యశాల ఆధ్వర్యంలో 2కే వాక్‌లో పాల్గొన్న పట్టణ వాసులు


వినుకొండలో 2కే వాక్

వినుకొండ, సెప్టెంబరు 29: జాతీయ హృదయ దినోత్సవం సందర్భంగా ఏనుగు పాలెం రోడ్డులోని శ్రీదత్త హాస్పిటల్ గుండె వైద్యులు గార్లపాటి కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 2కే వాక్ కోలాహలంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజి నుంచి శివయ్య స్తూపం మీదుగా ఏనుగుపాలెం సెంటర్‌లోని శ్రీదత్త వైద్యశాల వరకు 2కే వాక్ నిర్వహించారు. అనంతరం శారదాంబ ఫంక్షన్ హాల్లో గుండెపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజూ నడక, శారీరక శ్రమ గుండెకు ఆరోగ్యమని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మద్యపానం, ధూమపానం వలన గుండె ఆరోగ్యం చెడిపోతుందని వైద్యులు తెలిపారు. మానసిక ఒత్తిడి తగ్గించుకునేలా జీవన అలవాట్లు మార్చుకోవాలని, ప్రతిరోజూ యోగా, ధ్యానం వంటివి చేయడం ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ ఎల్ ఎన్ రావు, పీడియాట్రిక్ విభాగం వైద్యులు డాక్టర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


కపలవాయి విజయకుమార్ దంపతులును సత్కరిస్తున్న సత్రం కమిటీ సభ్యులు, అతిథులు

వృద్ధాశ్రమానికి విజయకుమార్ రూ.10 లక్షలు విరాళం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29: శ్రీకాశీ అన్నపూర్ణ వాసవి వృద్ధాశ్రమం, నిత్య అన్నదానం సత్రంకు రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ భారీ విరాళం అందజేశారు. తిరుపతిలో జరిగిన సత్రం నూతన కార్యవర్గం కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.10 లక్షలను సత్రం నిర్వహణకు ప్రకటించారు. సభలో కపలవాయి విజయకుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. సేవా కార్యక్రమాలలో ఆణిముత్యాలుగా వారిని ప్రకటించి కమిటీ సభ్యులు వారిని గౌరవించారు. అనంతరం కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ తమ మేనల్లుడు నంద్యాలకు చెందిన భవనాసి శ్రీనివాసరావు నూతన అధ్యక్షుడిగా ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు. వారి ఆధ్వర్యంలో తిరుపతి, కాశీ, షిర్డీ, హరిద్వార్, నూతనంగా శ్రీశైలంలలో విజయవంతంగా అన్నదాన కార్యక్రమాలు, వసతి కల్పించటం జరుగుతుందన్నారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా 36వేల మంది సభ్యులు ఉన్న సత్రం భవిష్యత్‌లో నిర్వహించే సేవలకు తమ వంతు సహకారం అందజేస్తానని కపలవాయి విజయకుమార్ తెలిపారు.



దరియా సుల్తానా బేగంకు ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు, సభ్యులు

పేద విద్యార్థికి రూ.20వేలు ఆర్థికసాయం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29: బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆదివారం నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న కార్యాలయంలో ప్రతిభ గలిగిన పేద విద్యార్థికి ఆర్థికసాయం చేసింది. మండలంలోని జొన్నలగడ్డకు చెందిన షేక్ దరియా సుల్తానా బేగం అనే విద్యార్థినికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేసింది. ఈ విద్యార్థిని కలాశలింగం అకాడమి ఆఫ్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్‌లో మూడో సంవత్సరం ఇంజనీరింగ్ చదవుతోంది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, సినీ నటుడు బొల్లు వెంకటకృష్ణారావు, సభ్యులు మర్లపాటి రామకృష్ణ, మధుబాబు, బొల్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన

● పల్నాడు జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు హనుమంతరావు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు

కనమర్లపూడి (శావల్యాపురం) సెప్టెంబరు 29: రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కనమర్లపూడిలో ఆదివారం ఆయన ఇంటింటికీ తిరిగి 100రోజుల పరిపాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేయబోయే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ప్రకటించిన విధంగా సీఎం చంద్రబాబు సామాజిక పింఛన్లను ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచడమే కాకుండా మూడువేలను కలిపి పింఛనుదారులకు అందించడం చారిత్రాత్మకమన్నారు. ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీపై ప్రకటన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ హామీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే నెరవేర్చి సీఎం చంద్రబాబు ప్రజలందరి మన్ననలు పొందారన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో వినుకొండ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందని, శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, వీపీఏ స్రవంతి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, మహిళా పోలీస్ మేనక, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నేతల జేబుల్లోకి జనం సొమ్ము

విద్యుత్ శాఖకు బకాయి రూ.13 లక్షలపై మాటే

నాదెండ్ల, సెప్టెంబరు 29: వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. అధికారాన్ని అడ్డు పెట్టుకొని లక్షలాది రూపాయలు ఆ పార్టీ నాయకులు అడ్డంగా దోచేశారు. పంచాయతీకి చెందాల్సిన లక్షలాది రూపాయల ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకున్నారు. విద్యుత్ శాఖకు మాత్రం రూ.13,38,486 బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో జరిగిన అవినీతి వివరాలు ఇలా ఉన్నాయి.


చిరుమామిళ్ళలోని రక్షిత తాగునీటి పథక ఓవర్ హెడ్ ట్యాంక్

చిరుమామిళ్ళ గ్రామస్థుడు, గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి 2007లో గ్రామానికి రక్షిత తాగునీటి పథకాన్ని మంజూరు చేయించారు. వివిధ పనులకు తాను సొంతంగా సుమారు రూ.50 లక్షల నిధులను ఖర్చుచేశారు. ఆనాడే ఇంటింటికి నీటి కుళాయి ఏర్పాటు చేశారు. 2009 నుంచి 2014 వరకు పంచాయతీ పేరుతో నీటి కుళాయికి నెలకు రూ.30 చొప్పున తాగునీరు ఇచ్చినందుకు రుసుం వసూలు చేశారు. 2014 నుంచి 2019 వరకు ఎన్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా అదే రుసుంతో గ్రామస్థులకు నీరు ఇచ్చారు. వసూలుచేసిన రుసుంను నీటి పథకం నిర్వహణకు ఉపయోగించారు.

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డి తదితరులు ఆ పథకాన్ని ఫౌండేషన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. నీటి రుసుంను కూడా నెలకు రూ.100 చొప్పున పెంచి వసూలు చేశారు. రాజన్న రక్షిత మంచి నీటి సరఫరా పథకం పేరుతో రసీదులు ముద్రించి లబ్ధిదారులకు అందించారు. కనీసం ఆ రసీదుపై ఎవరి సంతకం కూడా లేదు. గ్రామంలో సుమారు వెయ్యి నీటి కనెక్షన్‌లు ఉండగా రూ.100 చొప్పున నెలకు లక్ష రూపాయల వరకు వసూలు చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏడాదికి రూ.12 లక్షలు చొప్పున ఐదు సంవత్సరాల కాలంలో రూ.60 లక్షలు రుసుం వసూలు చేశారని గ్రామస్థులు అంటున్నారు. నిర్వహణ ఖర్చు కింద మిగిలిన సొమ్ము అంతా వాళ్ళ జేబుల్లోకే వెళ్ళిందంటున్నారు. అసలు నీటి పథకం నిర్వహణకు ఆ సొమ్ము వాడారా? లేక పంచాయతీ నిధులు వాడారా అనే విషయం విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు.

విద్యుత్ శాఖ బకాయి రూ.18 లక్షలపై మాటే

రక్షిత తాగునీటి పథకం ద్వారా వచ్చిన ఆదాయం పంచాయతీకి జమ చేయలేదన్న విషయాన్ని పక్కన పెడితే నీటి పథకం, పంచాయతీకి సంబంధించి విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేదు. గ్రామంలోని వాటర్ ప్లాంట్‌తో కలిపితే పంచాయతీకి వివిధ ప్రాంతాల్లో ఎనిమిది చోట్ల విద్యుత్ మీటరు కనెక్షన్‌లు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు చెల్లించకుండా జనం సొమ్ము జేబుల్లో వేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రక్షిత తాగునీటి పథకంతో పాటు వాటర్ ప్లాంట్ ద్వారా వచ్చిన ఆదాయం లక్షలాది రూపాయలు ఆ నేతల జేబుల్లోకి వెళ్ళిందని, విచారణ జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



లయోలాలో రసవత్తరంగా సాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు, హోరాహోరీగా తలపడుతున్న బాలికల జట్లు

హోరాహోరీగా ఫుట్‌బాల్ క్వార్టర్ ఫైనల్స్

వినుకొండ, సెప్టెంబరు 29: స్థానిక లయోలా పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సందర్శించి ఏర్పాట్లపై నిర్వాహకులను అభినందించారు. అదేవిధంగా క్రీడాకారులకు నిత్యం అందిస్తున్న ఆహార పదార్థాలతో పాటు, వారి ఆరోగ్యంపై ప్రత్యేక ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న జట్లు వివరాలు

లయోలా పాఠశాల్లో రెండో రోజు జరిగిన పోటీల్లో క్వాటర్ ఫైనల్‌కు బాలుర విభాగంలో గుంటూరు, ప్రకాశం, కడప, తూర్పుగోదావరి, అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నం జట్లు చేరాయి.

బాలికల విభాగంలో

కర్నూల్, చిత్తూరు, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, కడప జట్లు క్వాటర్ ఫైనల్‌కు చేరినట్లు ఫుట్‌బాల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు యలమంద, రాధాకృష్ణ, చిరంజీవి, కొండలు, రాజేష్, పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో శావల్యాపురం బాలికల ప్రతిభ


సిల్వర్ మెడల్స్‌తో శావల్యాపురం బాలికలు

శావల్యాపురం, సెప్టెంబరు 29: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు పాల్గొని అత్యున్నత ప్రతిభ కనబరచి జట్టును ద్వితీయస్థానంలో నిలిపి సిల్వర్ మెడల్స్‌ను కైవశం చేసుకున్నట్లు పాఠశాల హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ హర్యానా రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన ఇంటర్‌మీడియట్ బాలికలు బండారు దేవమణి, ముట్లూరి లూదియా ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొని మంచి ప్రతిభను కనబరచి జట్టును ద్వితీయస్థానంలో నిలిపారని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతులు సాధించి పెట్టారని కొనియాడారు. వీరిద్దరినీ ఆదర్శంగా తీసుకొని పాఠశాలలోని మిగిలిన విద్యార్థులు కూడా విద్యతో పాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. సిల్వర్ మెడల్ సాధించిన బాలికలను, వారికి మంచి శిక్షణనిచ్చిన పీడీ, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రాగుల రాధాకృష్ణమూర్తిని ఎస్ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్ఎం విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, రవి, శ్రీనివాసరావు, భువనేశ్వరి, కిరణ్మయి, విమలకుమారి, కవిత, సురేష్, శ్రీకాంత్‌లు తదితరులు అభినందించారు.

ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ మళ్ళీ గెలిచి చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలని, ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ వెరిఫికేషన్, క్లస్టర్ మీటింగ్ జరిగింది, ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవడ అరవిందబాబు మాట్లాడుతూ క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దీక్షలో పాల్గొన్న భక్తులు

భక్తుల మనోభావాలను కించపరిచే వారి పతనం తప్పదు

● విశ్వహిందూ పరిషత్


వినుకొండ టౌన్, సెప్టెంబరు 29: తిరుపతి లడ్డూ పవిత్రతను భంగపరిచే విధంగా లడ్డులో అపవిత్ర పదార్థాలు కలిసినట్లు వస్తున్న వార్తలపై పట్టణంలోని కొత్తపేట కోదండరామస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు దీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి గోవింద నామాలు, ప్రాయశ్చిత్త మంత్రాన్ని 108సార్లు జపించారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ నియోజకవర్గం అర్చకులు యడవల్లి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ ధర్మాన్ని రక్షించి, దోషులను శిక్షించాలని భగవంతుని ప్రార్థించామని తెలిపారు. లోకా సమస్తాం సుఖినోభవంతూ అని ప్రార్థించే హైందవ ధర్మదేవతలను, ఆచార వ్యవహారాలను అవహేళనచేస్తూ, హైందవ భక్తుల మనోభావాలను కించపరిచే వారి పతనం తప్పదని భాగవతుల విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో కొలిశెట్టి సుబ్బారావు, గజవల్లి నాగపవన్ కుమార్, భవనాసి సాంబశివరావు, గోనుగుంట్ల గంటారావు, నాగాచారి, దేవాలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

అక్టోబరు 3 నుంచి దేవీ శరన్నవరాత్రులు

రొంపిచర్ల, సెప్టెంబరు 29: మండలంలోని రొంపిచర్లలోని వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి దేవస్థానంలో అక్టోబరు 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు ఆదివారం తెలిపారు. ఆలయ ఆవరణలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు ధర్మకర్త తెలిపారు.

ఒలింపిక్స్‌కు పంపేందుకు సాయం చేస్తా

● అబ్దుల్లాకు సీఎం హామీ


అవార్డులు సాధించిన అబ్దుల్లాను ప్రశంసిస్తున్న సీఎం చంద్రబాబు

వినుకొండ, సెప్టెంబరు 29: లండన్, ఒలింపిక్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించేందుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని అబ్దుల్లా సంతోషం వ్యక్తం చేశారు. పరుగు పందెంలో అంతర్జాతీయ అవార్డులు పొందిన షేక్ అబ్దుల్లా ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలిసి వినతిపత్రం అందచేశారు. గతంలో తాను సాధించిన అవార్డులు చూసి ప్రశంసించినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడును కలిసే అవకాశం కల్పించిన డిగ్రీ కళాశాల విశ్రాంత ఉద్యోగి, గుంటూరు టీడీపీ సీనియర్ నాయకులు ఎండీ కరిముల్లాకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, వేదికపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, తదితరులు

పోరాటయోధుడు సీతారామ్ ఏచూరి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29: నియంతృత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం పోరాటం చేసిన గొప్పయోధుడు సీతారామ్ ఏచూరి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణం ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో సీతారామ్ ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఏ గఫూర్ మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి పంజాబీ, మళయాళం, హిందీ, బెంగాలీ, ఉర్దూ అనేక భాషలలో మాట్లాడగల్గిన ప్రావీణ్యం ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడడం కోసం విశేష కృషి చేశారని అన్నారు. సీతారాం ఏచూరి దేశభక్తుడని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేశారన్నారు. అన్ని పార్టీలతో సత్సంబంధాలు కల్గిన వ్యక్తి సీతారామ్ ఏచూరి అన్నారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయకుమార్ సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ మారుతీ వరప్రసాదు వీడీఎం వై వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

రొంపిచర్ల, సెప్టెంబరు 29: మండల కేంద్ర మైన రొంపిచర్ల గ్రామ సుబ్బారెడ్డి కాలనీలో సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. 78వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఫాస్టర్ సత్యం బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

కనుమూరి లక్ష్మికి గుర్రం జాషువా పురస్కారం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 29: కవి కోకిల గుర్రం జాషువా పురస్కారం టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కనుమూరి లక్ష్మికి అందజేశామని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలు పల్నాడు జిల్లా నరసరావుపేట భువన చంద్ర టౌన్ హాల్‌లో 26, 27, 28 తేదీలలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పురస్కారాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అందజేశారు.


లక్ష్మికి పురస్కారాన్ని అందజేస్తున్న వర్ల రామయ్య తదితరులు


గోపాలంవారిపాలెంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

గోపాలంవారిపాలెంలో మెగా వైద్య శిబిరం

● 450 మందికి ఉచిత వైద్యసేవలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెంలో నరసరావుపేట తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 450మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యులు బొట్ల రఘుప్రసాద్, బొట్ల పార్వతి, బొట్ల రంగతేజ, కర్నాటి శ్రావణిలు రోగులకు ఎముకలు, కీళ్ళు, నరముల వ్యాధులతో సహా అన్నిరకాల సాధారణ పరీక్షలు, బీపీ, షుగరు, గర్భిణులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. రోగులకు వ్యాధుల గురించి అవగాహన కల్పించి సలహాలు, సూచనలు అందచేశారు. అవసరమైన వారికి నేత్ర పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో చిలకలూరిపేటకు చెందిన సుమ వర్ష మెడికల్స్ అధినేత ముత్తినేని వెంకటేశ్వర్లు సహకారంతో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరానికి గోపాలంవారిపాలెం పరిసర గ్రామాల నుంచి రోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తేజ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ బొట్ల రఘు ప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజులలో ప్రతి నెల ఒక్కో గ్రామంలో మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. అలానే శిబిరాలకు వచ్చిన రోగులకు నరసరావుపేటలో ఉచిత ఓపీతో అన్ని రకాల పరీక్షలపై 20శాతం రాయితీ అందచేస్తామని చెప్పారు.

ఎక్సైజ్ సీఐగా కొడాలి వినయకుమార్

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: చిలకలూరిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐగా కొడాలి వినయకుమార్ కొత్తగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. వినయకుమార్ ఎక్సైజ్ ఎస్ఐ స్థాయి నుంచి ప్రమోషన్‌పై సీఐగా ఇక్కడ నియమితులయ్యారు.

నూతన సబ్ రిజిస్ట్రార్‌గా షేక్ అబ్దుల్ రహమాన్

చిలకలూరిపేట, సెప్టెంబరు29: చిలకలూరిపేట నూతన సబ్ రిజిస్ట్రార్‌గా షేక్ అబ్దుల్ రహమాన్ నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఇప్పటివరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న శ్రీనివాసరావు ఒంగోలుకు బదిలీ అయ్యారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.10 వేలు జరిమానా

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: మద్యం సేవించి వాహనం నడుపుతున్న పి.దేవానంద్ అనే వ్యక్తిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని స్థానిక ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జి ఎదుట హాజరుపరచగా రూ.10 వేల జరిమానా విధించారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఆ వ్యక్తి ప్రస్తుతం చిలకలూరిపేట మండలం తాతపూడిలో నివాసముంటున్నాడు. మద్యంతాగి బైక్‌పై తాతపూడికి వెళ్తుండగా జాతీయ రహదారిపై బొప్పూడి జంక్షన్ వద్ద పోలీసుల తనిఖీలలో ఇతడు పట్టుబడ్డాడు.

బంగారు ఆభరణాల రికవరీ

యడ్లపాడు, సెప్టెంబరు 29: నివాస గృహంలో చోరీ గురైన బంగారు ఆభరణాలను నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యడ్లపాడు కాలనీలోని డేరంగుల దేవి గృహంలో గడిచిన 23న పగలు చోరీ జరిగింది. నాన్‌తాడు, చెవిదిద్దులు తదితర సుమారు 40గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు పాత కేసుల్లో నిందితుడిగా ఉన్న రఘునాథం కిరణ్ నగలను చోరీ చేసినట్టు గుర్తించారు. ఆ నగలు సింగరాయకొండలోని కీర్తన అండ్ గోల్డ్ లోన్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్టు తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ నగలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఏఎంజీలో ముగిసిన బాక్సింగ్ పోటీలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలు ముగిశాయి. జిల్లా సెలక్షన్లలో భాగంగా ఈ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 190మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యుత్తమ క్రీడా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను గుంటూరు జిల్లా బాక్సింగ్ జట్టుకు ఎంపిక చేశారు. అండర్-14 బాక్సింగ్ జట్టుకు శ్రీధర్, మనోజ్ కుమార్, లక్ష్మీనరసింహ, అశోక్, శశిధర్ రాణా, స్మిత్, పవన్, సంజయ్, సాయి హర్ష తదితరులు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల జట్టుకు నందిని, మానస, కీర్తన, శ్యామ్ శరణ్య, గౌతమి, కాత్యాయిని తదితరులు ఎంపికయ్యారు. అదే విధంగా అండర్-19 బాలుర, బాలికల జట్లను కూడా ఎంపిక చేశారు.

10వ తరగతి విద్యార్థులకు సైన్సు పుస్తకాల వితరణ

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: స్థానిక సేవా సంస్థ ఓయాసిస్ ఆధ్వర్యంలో ఆదివారం కేజే ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో 130మంది 10వ తరగతి విద్యార్థులకు రూ.7,500 విలువచేసే సైన్స్ పుస్తకాలను అందచేశారు. చుండి సునీత ఆర్థికసాయంతో ఈ సాయం అందించారు. ఒక ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి కూడా కొంత ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో ఓయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, కార్యదర్శి కరణం విజయ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన చిలకలూరిపేట నాయకులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: చిలకలూరిపేట టీడీపీ నాయకులు ఆదివారం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీలో బీసీలకు ఇచ్చే విలువ, గౌరవం మరే పార్టీలోనూ లభించదన్నారు. గత ప్రభుత్వంలో బీసీలపై జరిగిన దాడులు, అన్యాయాలపై వినతిపత్రం ఆయనకు అందచేశారు. రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో టీడీపీకి చెందిన సీనియర్ నాయకులు స్థానిక రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ అధినేత కంచర్ల శ్రీనివాసరావు, ఆర్టీసీ కార్మిక నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ తెల్లబాటి కృష్ణ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు

12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వేతన సవరణకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు కోరారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల సమావేశం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు మాట్లాడుతూ దసరా పండుగ కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి ప్రాథమిక పాఠశాలల విలీనం వచ్చే విద్యా సంవత్సరం నుంచి విరమించుకుంటానని తెలియచేసినందుకు ఎస్టీయూ తరఫున హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీయూ రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలపై దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఆయా మండలాలు, పట్టణ శాఖల నాయకులు మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాష్, షేక్ మగ్బుల్ బాషా, దుర్గాప్రసాద్ జి.కోటేశ్వరరావు, సతీష్ కుమార్ బొంతా రవి, మస్తాన్ వలి పాల్గొన్నారు.